TAROOF-E-ISLAM

# ఇస్లాం పరిచయం



మౌలానా వహీదుద్దీన్ ఖాన్

# ఇస్లాంపరిచయం

TAROOF-E-ISLAM

రచన

మౌలానా వహీదుద్దీన్ ఖాన్

అనువాదం

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**Presented to**

**.....................................................**

**.....................................................**

**From.............................................**

**Date..............................................**


ఇస్లామీ కేంద్రం ప్రచురణలు

మక్తబా అర్రిసాల, న్యూఢిల్లీ

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# ముందుమాట

ప్రతి మనిషికీ ఒక ఆలోచన ఉంటుంది. దాని ప్రకారమే అతను జీవితాన్ని గురించి, సృష్టిని గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకుంటాడు. మరి దానికనుగుణంగానే ఏదో ఒక దానికి ప్రాధాన్యత ఇస్తాడు. దాన్నే తన విశ్వాసాలకు, శ్రద్ధాసక్తులకు కేంద్ర స్థానంగా చేసుకుంటాడు. మరి దానికనుగుణంగా తాను సమాజంలో ఆచరిస్తాడు. ఈ మూడింటినే విశ్వాసం, ఆరాధాన, నడవడి అని అనవచ్చు. ఈ మూడు వస్తువుల సమాహారానికి మరో పేరే దీన్ (ధర్మం). ఈ రకంగా చూచినప్పుడు ప్రతి మనిషికీ అతను మతావలంబీకుడైనా, నాస్తికుడైనా... ఒక దీన్ (ధర్మం) అనేది ఉంటుంది.

ఇస్లాం అంటే ఏమిటి? నిఖిల జగతి వెనుక ఒకానోక శక్తిమంతుడున్నాడని, ఆయన సంకల్పమే దీని వెనుక పనిచేస్తోందనీ, ఆయనే దీనికి కర్త మరియు పోషకుడని మనిషి గుర్తించాలి. ఆయన సమక్షంలోనే ప్రతి ఒక్కరి లెక్క తేలవలసి ఉందని, ఆయన సన్నిధిలో సత్యంగా ఖరారయ్యేదే సత్యమని, ఆయన ఎదుట మిథ్యగా ఖరారయ్యేదే మిథ్య అని మనిషి నిష్కల్మష హృదయంతో నమ్మాలి. ఇదే ఇస్లాం అంటే.

ఈ సత్యాన్ని గ్రహించటం ఏదో గణితశాస్త్ర ఫార్ములాను కనుగొనటం వంటిది కాదు. ఇది మనషి దైవాన్ని కనుగొనడం. ఏమీ 'లేని' వాడు సర్వం 'కలిగి' ఉన్న వాడిని పోందడం! కాబట్టి ఎవరయితే ఈ సత్యాన్ని పొందుతాడో అతను తన పూర్తి అస్థిత్వంతో సహా ఓ క్రొత్త మనిషి అయిపోతాడు. అతని జీవితం ఓ కారుణ్య కడలిలో జలకాలాడుతుంది. అది ఎటువంటి పరిశోధనంటే, అది అతని మనో మస్తిష్కాలను తన అదుపులోకి తీసేసుకుంటుంది. అతనేది చూసిన, ఏది విన్నా దివ్య దృష్టితో చూస్తాడు. వింటాడు. అతని భావాలు భావనల జగత్తు ఇప్పటి వరకు అంధకారబంధురమై ఉండేది. ఇప్పుడు అందులో శుభోదయ కిరణాలు ప్రసరించాయి. ఇప్పుడతని వ్యక్తిత్వం ధగధగా మెరిసిపోతోంది. పవిత్రమైన ఈ భావాల మూలంగా ఇప్పడతను ఆసాంతం దేవునివాడైపోతాడు. అతను ఆయన స్మరణలోనే జీవించసాగుతాడు. ఆయన సమక్షంలో తనను అర్పించుకుంటాడు. తన అస్థిత్వాన్నంతటినీ ఆయన ఎదుట వంచేస్తాడు.

తత్ఫలితంగా సాటి సోదరుల పట్ల అతని ప్రవర్తనలో అనూహ్యమైన మార్పు వచ్చేస్తుంది. తోటి మానవ సోదరుల పట్ల ఇప్పుడతను ఒక దేవుని దాసుడుగా మెలుగుతాడు. ప్రజలు అహంభావం ప్రదర్శించిన చోట ఇతను అణకువను, వినమ్రతను ప్రదర్శిస్తాడు. ప్రజలు ప్రతీకార వాంఛతో పెట్రేగిపోతున్నచోట అతను మన్నింపుల వైఖరిని అవలంబిస్తాడు. ప్రజలు తమ స్వలాభాలకోసం బంధుత్వ సంబంధాలను విచ్ఛిన్నపరుస్తుంటే, ఇతనేమో సత్యం కొరకు సత్సంబంధాలను మెరుగుపరచుకుంటాడు. ప్రజలు దేన్నయినా ఆర్జించి సంతృప్తులైతే, ఇతను పరులకు ప్రయోజనం చేకూర్చి ఆనందిస్తాడు. ప్రజలు ప్రాపంచిక జిలుగు వెలుగుల వైపునకు ఎగబడుతుంటే ఇతను మాత్రం అగోచరమైన పారలౌకికంలో తనను లీనం చేసుకుంటూ ఉంటాడు – ప్రవక్త ద్వారా మనిషికి తెలుపబడిన పవిత్ర జీవితం ఇదే.

ఎవరయితే ఈ విధంగా ఒకే దైవాన్ని అనుసరిస్తారో వారు సహజంగానే పరస్పరం సంగఠితమవుతారు. తాము తమ కొరకు అవలంబిస్తున్న మేలును పరులకు కూడా అందించడానికి సమాయత్తమవుతారు. వారి బాహ్య జీవితం వారి అంతరంగాన్ని ప్రతిబింబిస్తూ ఉంటుంది.

మహదుద్దీన్ ఖాన్
29/12/1980

# దేవుడున్నాడు

ఈ సమస్త జగతికి దేవుడనే వాడొకడున్నాడు. ఆయనే దీనికి సృష్టికర్త, యజమాని. ఆ దేవుడున్నాడనే దానికి అన్నిటికంటే గొప్ప ఆధారం మన కళ్లముందు విస్తరిల్లి ఉన్న ఈ సువిశాల ప్రపంచమే. అద్వితీయ దేవుడు ఒకడున్నాడని, ఆయనే తనను నిర్మించాడని, ఆయనే అనంతమయిన శక్తియుక్తులతో తనను నడుపుతున్నాడని ఈ నిఖిల జగత్తు అనుదినం చాటిచెబుతున్నది. మనం ఈ జగతి ఉనికిని విశ్వసించక తప్పటం లేదు. కనుక దైవాన్ని కూడా విశ్వసించటం తప్ప మనకు గత్యంతరం లేదు. సువిశాలమయిన ఈ విశ్వ వ్యవస్థ ఎంత అద్భుతమైందంటే ఒకానొక నిర్మాత లేకుండా అది నిర్మితం కాదు. దాని పరిపాలన యంత్రాంగం ఎంత పటిష్ఠంగా, పకడ్బందీగా ఉందంటే ఒకానొక సూత్రధారి లేనిదే అది నడవజాలదు. యదార్ధమేమిటంటే మనిషి ఏ విధంగానయితే తన ఉనికిని విశ్వసించక తప్పదో అదేవిధంగా దైవాన్నీ విశ్వసించక తప్పదు.

మీరు సైకిల్ చక్రం పై ఒక కంకరరాయి ఉంచండి, తరువాత సైకిలు పెడల్‌పై కాలువేసి దాన్ని గిరగిరా తిప్పండి – అప్పుడు కంకరరాయి అంత దూరాన వెళ్లి పడుతుంది. అంతచేసీ సైకిలు చక్రం తిరిగే వేగం గంటకు 25 మైళ్ళ కన్నా ఎక్కువ ఉండదు. మనం నివసించే ఈ భూమి కూడా వెయ్యి మైళ్ల వేగంతో పరుగెత్తుతోంది. ఈ వేగం సాధారణంగా విహరించే పౌర విమానాలకంటే ఎక్కువే. ఇంతవేగంగా తిరిగే భూమి పై మనం సంచరిస్తున్నాము. అందమయిన ఇళ్లు కడుతున్నాము.నగరాలను నిర్మిస్తున్నాము. అయితే తిరిగే చక్రం పై ఉన్న కంకరరాయికి పట్టిన గతి మనకు పట్టడం లేదు. ఎంత అద్భుతం ఇది! క్రింది నుంచి భూమిలో ఆకర్షణాశక్తి ఉండటం వల్ల, పైనుంచి గాలి ఒత్తిడి ఉండటం మూలంగా మనం భూమి పై నిలదొక్కుకో గలుగుతున్నామని అనబడుతోంది. ఈ రెండు కారణాల వల్లనే మనం సైకిలు చక్రం పై నుంచి కంకరరాయిలా ఎగిరి పడటం లేదని అంటుంటారు. మన పరిసరాలలో ఇంతకన్నా ఆశ్చర్యకరమయిన మరొక అద్భుతం ఉందని ఈ సమాధానం విశదపరుస్తోంది. భూమిలో ఇంతటి విస్తృత స్థాయిలో ఆకర్షణా శక్తి ఉండటం, దానికి నలువైపులా గాలిలో ఐదు వందల మైళ్ల లావైన ఆచ్ఛాదనము నిరంతరం చుట్టబడి ఉండటం – ఇదంతా ఆశ్చర్యాన్ని మరింత పెంచుతుందే తప్ప తగ్గించదు.

యదార్థానికి ఈ ప్రపంచంలోని ప్రతిదీ అద్భుతమే. మనిషి నేలలో ఒక చిన్న విత్తనం చల్లుతాడు. అది ఆశ్చర్యకరమైన రీతిలో పచ్చని మొక్కగా నేలను చీల్చుకుంటూ పైకి రావడాన్ని అతను తిలకిస్తాడు. అతను మరొక విత్తనం వేసి చూస్తే తియ్యని క్యారెట్ పుట్టుకొస్తుంది. అలాగే అసంఖ్యాకమయిన ఇతరత్రా వస్తువులు నేల నుండి ఉత్పత్తి అవుతుంటాయి. ఒక విత్తనం ద్వారా జామ చెట్టు, మరో విత్తనం ద్వారా మామిడి చెట్టు, వేరొక విత్తనం ద్వారా కలప వృక్షం పుట్టుకొస్తాయి. మరి వాటి రంగు వేరు, రూపు వేరు, రుచులు వేరు. వాటి ప్రయోజనాలూ వేర్వేరు. ప్రత్యేకతలు వేరు. ఒకే నేల నుండి – అత్యంత చిన్న విత్తనాల నుండి – ఇన్ని రకాల వస్తువులు తమ తమ ప్రత్యేకతలతో ఉత్పన్నమవుతున్నాయి. వాటిని మనం లెక్కించనయినా లేము. ఆశ్చర్యపరిచే అద్భుతాల సువిశాల ప్రపంచం మనకు నలువైపులా విస్తరించి ఉంది. సమస్త మానవులంతా కలసి కూడా ఒక ఆవగింజను సృష్టించలేరు. ఈ ప్రపంచంలో ఇవన్నీ ఎలాంటి అద్భుతాలంటే వాటిని మనుషుల నోళ్లు వర్ణించజాలవు. వాటిని కొనియాడటానికి మన నిఘంటువులన్నింటిలోని పదాలు తెచ్చినా సరిపోవు. ఒక దేవుడు లేకుండా ఇన్ని అద్భుతాలు వాటంతట అవే ఉనికిలోకి రాగలవా?

ప్రపంచంలోని ప్రతి వస్తువు పరమాణువు ద్వారా చేయబడింది. ప్రతి వస్తువు తన చివరి విశ్లేషణలో పరమాణువుల సముదాయం అవుతుంది. కాని ఆశ్చర్యకరమయిన విషయం ఏమిటంటే ఒక చోట పరమాణువులు ఒక పరిమాణంలో సమకూరగా అది మండే సూర్యుడులాంటి ఆకారాన్ని సంతరించుకుంది. మరొకచోట ఆ పరమాణువులే కలసి ప్రవహించే నీరులా అయిపోయాయి. వేరొకచోట ఈ పరమాణువుల సముదాయములే చల్లని కోమలమైన గాలుల రూపాన్ని సంతరించుకున్నాయి. ఇంకోచోట చూస్తే ఈ పరమాణువులే సారవంతమైన నేలగా మారిపోవటం కనిపిస్తుంది. ఇలాంటివే ప్రపంచంలో లెక్కకు మించిన వస్తువులు ఉన్నాయి. అవన్నీ పరమాణువుల ద్వారానే క్రమ వికాసమొందాయి. కాని అన్నింటి తరహా వేరు, గుణాలు వేరు. ఈ రకమయిన అద్భుతాల ప్రపంచం ఒకటి తన అసంఖ్యాకమయిన కార్యకలాపాలతో పాటు మనిషి సేవలో నిమగ్నమై ఉంది. మనిషి జీవికకు అవసరమయిన వస్తువులు విస్తృతస్థాయిలో ప్రపంచంలో సమకూర్చబడ్డాయి. ఇంకా అవి ప్రతి రోజూ సమకూర్చబడుతూనే ఉన్నాయి. పుడమిని తన మనుగడకు అనుగుణంగా మలచుకోవటానికి మానవుడు చేయాల్సిన కృషి బహు తక్కువ. అగణ్య పరిమాణంలో విలువైన ఆహార వస్తువులను ఉత్పత్తిచేసే ఏర్పాటైతే ప్రకృతిపరంగానే – దైవికంగానే – జరిగిపోయింది. మనం చేయవలసింది

మన చేతులకు, నోటికి పని కల్పించి వాటిని కడుపులో వేసుకోవటమే. ఆ తరువాత మన సంకల్పానికి ప్రమేయం లేకుండానే ఆహారం మనలో జీర్ణమై మాంసంగా, రక్తంగా, ఎముకలుగా, శిరోజాలుగా మారిపోయి అది మన శరీరంలో ఒక భాగమైపోతుంది. భూమ్యాకాశాల అసంఖ్యాకమయిన ప్రదక్షిణల తరువాత అద్భుతమయిన ఒక వస్తువు తయారవుతుంది. దాన్ని మనం చమురు అంటున్నాము. మనిషి చేయవలసిందల్లా దాన్ని తీసి యంత్రాలతో నింపుకోవటమే. మరి ఈ చమురే మానవ సంస్కృతీ నాగరికతల పై విశేషమయిన ప్రభావం వేసి ప్రగతిపథంలో నడిపిస్తుంది. అలాగే విశ్వ వ్యవస్థ తరపున అసంఖ్యాకమయిన వస్తువులు లెక్కకు మించిన పరిమాణంలో ఉత్పత్తి అవుతున్నాయి. మానవుడు చాలా స్వల్పమయిన కృషితో వాటిని దుస్తులుగా, ఇళ్లుగా, సామగ్రిగా, పరికరాలుగా, యంత్రాలుగా, వాహనాలుగా ఇంకా అసంఖ్యాకమయిన సాంస్కృతిక చిహ్నాలుగా మలచుకుంటున్నాడు. వీటన్నింటినీ నిర్మించేవాడు, వాటిని నడిపేవాడు ఒకడున్నాడని ఈ సంఘటనలు చాటిచెప్పటం లేదూ?!

విషయాన్ని మరో కోణం నుంచి చూడండి – ప్రకృతి తన సుదీర్ఘమయిన, వర్ణనాతీతమయిన ప్రక్రియ ద్వారా అన్ని రకాల వస్తువులను తయారుచేస్తున్నది. మనిషి వాటిని తనకు ఉపయోగకరంగా మలచుకోవటానికి చేసే ప్రయత్నాలు చాలా స్వల్పం. అతను ఉక్కును యంత్రాంగా మారుస్తాడు. అతను చమురును శుద్ధిచేసి తన వాహనల టాంకుల్లో పోసుకుంటాడు. అతను చేసే ఈ చిన్నపాటి ప్రయత్నానికే నేలలోనూ, నీటిలోనూ కల్లోలం చెలరేగుతుంది. ప్రకృతి మనకు ఎంతో అందమైన, స్వచ్ఛమయిన ప్రపంచాన్ని ప్రసాదించింది. కాని మన ఆచరణ కాలుష్యం, గలాటా, మాలిన్యం, లూటీ, దహనాలు, కక్షలు కార్పణ్యాలు ఇంకా అసంఖ్యాకమయిన సమస్యల రూపంలో మనను చుట్టుముట్టింది. కర్మాగారాలు, సాంస్కృతిక కార్యకలాపాల రూపంలో మనం చేసే కొద్దిపాటి కృషి జగతిలో అసంఖ్యాకమయిన అపరాధాలకు మూలమవుతోంది. రేయింబవళ్లు పాప కార్యాలు జరుగుతున్నాయి. అయినా నిఖిల జగతి దీని ప్రభావానికి గురికావటం లేదు. భూమి రెండు రకాలుగా పరుగెత్తుతోంది. ఒకటి – తన పరిమితుల్లో, రెండు – సూర్యుని చుట్టూ తన కక్ష్యలో తిరుగుతోంది. కాని అది ఎలాంటి కలకలాన్ని రేకెత్తించదు. వృక్షాలు ఒక గొప్ప కర్మాగారంలా పనిచేస్తున్నాయి. కాని అవి వాతావరణ కాలుష్యాన్ని విరజిమ్మవు. సముద్రాలలో ఎన్నో చరాలు అనుదినం చచ్చిపోతుంటాయి. కాని అవి నీటిని పాడుచెయ్యవు. విశ్వ వవ్యస్థ వేనవేల కోట్ల సంవత్సరాలుగా పనిచేస్తూ ఉంది. కాని దాని ప్రణాళిక ఎంత పటిష్టంగా ఉందంటే దానికి సంబంధించి

పున:పరిశీలన చేయవలసిన అగత్యమే ఏర్పడలేదు. అసంఖ్యాకమయిన నక్షత్రాలు, గ్రహాలు గగన వీధుల్లో పయనిస్తున్నాయి. కాని వాటి గమనంలో వేగంలో మార్పు రాలేదు. అవి ఎన్నడూ ఒకదాన్ని ఒకటి మించిపోవు. ఇది అనుదినం ప్రపంచంలో తారసపడే మహిమలన్నింటిలోకీ పెద్ద మహిమ. ఈ అనంతమయిన విశ్వం వెనుక ఒక దేవుడున్నాడని మనిషి విశ్వసించడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

మరి జీవితాన్ని చూడండి – కొన్ని భౌతిక వస్తువులు వాటంతట అవే ఒక శరీరాకారంలో సమకూరుతాయి. చేపై నీటిలో ఈదే , పక్షి అయి గాలిలో ఎగిరే జీవాలు ఉనికిలోకి వస్తాయి. రకరకాల పశువులు పుట్టుకొచ్చి నేల పై సంచరిస్తాయి. వాటిలో మనిషి అనబడే జీవి కూడా ఉన్నాడు. సముచితమయిన రీతిలో అతని శరీరం ఏర్పడుతుంది. ఎముకలు అత్యంత అర్థవంతమయిన రీతిలో అమర్చబడతాయి. మరి వాటి పై మాంసం వస్తుంది. దాని పై చర్మపు పొర కప్పబడుతుంది. వెంట్రుకలు, గోళ్లు వస్తాయి. మరి దాని తరువాత శరీరమంతటిలో రక్తపు కాలువలు ప్రవహింపజేయబడతాయి. ఆ విధంగా ఒక ప్రక్రియ ద్వారా ఒక విచిత్రమయిన మనిషి రూపొందించబడతాడు. అతను నడుస్తాడు, ఆలోచిస్తాడు, జ్ఞాపకముంచుకుంటాడు. విషయాలను సేకరించి సంచలనం సృష్టిస్తాడు. చదువుతాడు, వ్రాస్తాడు. జీవం లేని ఒక పదార్థం ఈ రకమయిన ఆశ్చర్యకరమైన అస్థిత్వంగా మారటం మామూలు విషయం కాదు. మహిమ అనే పదం కూడా దీనికి సరిపోదు. మట్టి మాట్లాడుతుండగా, రాయి నడుస్తుండగా నేను కళ్ళారా చూశానని ఎవరయినా అంటే అందరూ  ఆశ్చర్యపోతారు. ఈ విషయమందలి నిజానిజాలను తెలుసుకోవటానికి పరిశోధన చేస్తారు. మరి చూడబోతే ఈ మనిషి దేంతో చేయబడ్డాడు. మాట్లాడే, నడిచే, చూసే శక్తులు గల ఈ మనిషి ఆ మట్టి మరియు రాయితోనే చేయబడ్డాడు.  మట్టి మరియు రాయిలో ఉండే మూలాంశాలే ఇతనిలోనూ ఉన్నాయి. మట్టి, రాయి మాట్లాడుతున్నాయంటే చూస్తున్నాయంటే ఆశ్చర్యపోయే మనం మానవుడనబడే ఒక జీవి మాట్లాడుతున్నాడని, చూస్తున్నాడని చెప్పినా ఎంతో ఆశ్చర్యం చెందాల్సింది. నిర్జీవమయిన పదార్థం నుండి ఈ రకమయిన జీవితం మరియు చైతన్యం పుట్టుకురావటం దేన్ని సూచిస్తోంది. ఒకానొక శక్తిమంతుడు విచిత్రమయిన శక్తుల ద్వారా అద్భుతాలను, లీలలను చూపుతున్నాడనడానికి ఇది తార్కాణం కాదా?

మానవుడు తన స్థితి పై యోచన చేస్తే దేవుని వాస్తవికత సులభంగా గ్రహిస్తాడు.

మానవ రూపంలో ఒక “నేను” భూభాగం ఉండటాన్ని మనం చూస్తున్నాము. అతనికంటూ ఒక అస్థిత్వం ఉంది. అతను ఇతరత్రా వస్తువులకు వేరుగా ఒక ఉనికి కలిగి ఉంటాడు. ఈ “నేను” అనేది నిస్సందేహంగా అతడున్నాడని చెబుతోంది. అతను ఆలోచిస్తాడు. అభిప్రాయం ఏర్పరచుకుంటాడు. అతను సంకల్పించుకుంటాడు. దానికి క్రియాత్మక రూపం ఇస్తాడు. తన నిర్ణయానుసారం ఒకచోట ఒక వైఖరిని మరోచోట మరో వైఖరిని అవలంబిస్తాడు. ఈ వ్యక్తిత్వమే ఈ శక్తే ఒక మనిషిగా “నేను” స్థాయిలో రకరకాల ప్రయోగాలు చేస్తున్నది. మరి ఈ “నేను” దేవుని రూపంలో మరింత విస్తృతస్థాయిలో ఉంటే అందులో ఆశ్చర్యం చెందాల్సిన అవసరం ఏముంది? వాస్తవానికి తన్ను తాను విశ్వసించటం ఎటువంటిదో దైవాన్ని విశ్వసించటం కూడా అటువంటిదే. మనిషి ఎన్ని సాకులు చెప్పినప్పటికీ తన కొరకు తానే సాక్షి (తార్కాణం) అని దివ్యఖుర్ఆన్‌లో చెప్పబడింది.(29 యామ 14-15)

దైవాన్ని, దైవ సందేశాన్ని విశ్వసించేందుకు ప్రజలు మహిమ కావాలంటారు. చమత్కారాలు చూపించమంటారు. అనూహ్యమైన రీతిలో పెద్ద ఎత్తున విస్తరించి ఉన్న మహిమ కన్నా మరొకటి ప్రజలకు ఏం కావాలి? ఇంత గొప్ప మహిమే మనిషిని వంచడానికి ఉపయోగపడక పోయినప్పుడు మరింక ఏ మహిమను చూసి అతను విశ్వసిస్తాడు? యదార్థానికి దైవాన్ని విశ్వసించడానికి, బేషరతుగా ఆయనకు సమర్పించుకోవటానికి ఏ తార్కాణమైతే మనిషికి కావాలో అది అనుక్షణం అతని ముందు ఉంది. అయినప్పటికీ మనిషి దైవాన్ని, ఆయన అద్భుతాలను విశ్వసించకపోతే అది అతని దోషంగాని విశ్వ వ్యవస్థది కాదు.

ఎవరయితే దైవాన్ని పొందాడో అతను సమస్తాన్నీ పొందాలి. దైవాన్ని పొందిన తరువాత ఇక పొందాల్సింది ఏమీ ఉండదు. అందుచేత ఏ వ్యక్తయినా దైవాన్ని పొందినప్పుడు అతని ధ్యాసంతా దేవుని వైపునకే ఉంటుంది. మనిషి ఇహపర సాఫల్యాలకు అవసరమయిన ఖజానాను అతను దైవం వద్ద పొందుతాడు.

ఒక వ్యక్తి “యాపిల్” తిన్నాడు గాని యాపిల్ రుచి అతనికి లభించలేదు, ఆ పండు అతని శరీరంలోకి బలాన్ని చేకూర్చలేదు అని అంటే ఎవరయినా ఏమంటారు? అతను తిన్నది యాపిల్ కాదు యాపిల్ లాంటిది మరేదో నమలి ఉంటాడని అనుకుంటారు. దేవుని పరిస్థితి కూడా ఇటువంటిదే. మనిషి దైవాన్ని పొందినప్పుడు అందలి కమ్మదనాన్ని అతను ఆస్వాదించగలగాలి. దైవాన్ని పొందిన తరువాత కూడా మనిషి మాధుర్యాన్ని ఆస్వాదించలేకపోతే

అతను నిజంగా దైవాన్ని పొందలేదన్నమాట! వేరే ఏ వస్తువునో గ్రహించి దాన్నే దేవుడని భ్రమపడుతున్నాడన్నమాట! అతను మట్టితో చేయబడిన కృత్రిమమయిన యాపిల్ పండును నమలుతూ అదే నిజమయిన యాపిల్ అని పొరబడుతున్నాడన్నమాట!

ప్రపంచం తన ప్రారంభ దశలో కేవలం ఒకలాంటి పదార్థంగా ఉంటుంది. యావత్ప్రపంచం పరమాణువుల రాశి. వేరే మాటల్లో చెప్పాలంటే ప్రపంచం నిర్జీవమయిన పదార్థం. ఈ నిర్జీవమయిన పదార్థాన్ని దేవుడు అసంఖ్యాకమయిన రూపాలలో ఆవిష్కరిస్తున్నాడు. ఈ నిర్జీవమయిన పదార్థంతో దేవుడు ఒకచోట వెలుగును సృష్టిస్తే ఇంకొకచోట ఉష్ణోగ్రతను సృష్టిస్తున్నాడు. జీవం లేని ఆ పదార్థాన్ని ఒకచోట పచ్చికగా మారుస్తున్నాడు, మరోచోట ప్రవహించే నీరుగా మారుస్తున్నాడు. ఒకచోట దాన్ని రంగు రూపంలో సృష్టిస్తే వేరొకచోట సువాసనగా, రుచిగా రూపొందిస్తున్నాడు. ఈ నిర్జీవమయిన పదార్థం నుండి ఒకచోట కదలికల చమత్కారాలు కానవస్తే, వేరొకచోట ఆకర్షణా శక్తి బహిర్గతమవుతోంది. ఇంతటి అద్భుతమయిన శక్తులు గల దైవాన్ని పొందడమంటే మామూలు విశ్వాసాన్ని పొందినట్లు కాదు – అటువంటి విశ్వాసాన్ని పొందిన మనిషి హృదయం జ్యోతిర్మయం కావాలి. అది అతని అంతరాత్మకు తృప్తిని, మాధుర్యాన్ని అందించగలగాలి. మనిషి ఒక మంచి పండును తిన్నప్పుడు సంతృప్తిని, సంతోషాన్ని ఆస్వాదిస్తాడు. ఒక వ్యక్తి తియ్యని గీతాన్ని వినప్పుడు అతని మేను పులకిస్తుంది. ఒకరి ఇంట అందమయిన శిశువు జన్మిస్తే వారి ఆనందానికి అవధులు ఉండవు. మరి అలాంటప్పుడు సకల శుభాల సరోవరం అయిన దేవుడు ఎవరికయినా లభించినప్పుడు అతను ప్రభావితుడు కాకుండా ఎలా ఉంటాడు?

దైవాన్ని పొందడమంటే తన మనోమస్తిష్కాలకు మత్తెక్కించే సువాసనను పొందడం అన్నమాట. అలాంటి దేవుడు ఒక రుచి అయి అతని అణువణువుకూ తృప్తిని, ప్రశాంతతను చేకూరుస్తాడు. అది తన ఒడిలో పులకింపజేసే కోమలమయిన గాలి కావాలి. అది అతని మనో నేత్రాన్ని ముగ్ధం చేసే అందం కాగలగాలి. అది అతనికి వినసొంపైన, ఎంత విన్నా తనివి తీరని శ్రావ్యమైన గేయం కావాలి. దైవాన్ని పొందినవాడు ఇన్ని విధాలుగా సంతృప్తిని ఆస్వాదించాలి మరి. వెలుతురును సృజించిన దేవునిలో వెలుతురు ఉండకపోవటమా? అసంభవం! రుచిని సృష్టించిన ప్రభువులో రుచి ఉండకపోవడం అనేది ఎలా సాధ్యం? వాస్తవమేమిటంటే దేవుడు వెలుతురు లన్నింటిలోకీ ఎక్కువ వెలుతురు కలవాడు. ఆయన

రుచులలోకెల్లా గొప్ప రుచి గలవాడు. ఎవరికయినా దైవసామీప్య భాగ్యం కలిగిందంటే దాని భావం అతను రంగురంగుల సువాసనలు గల నందనవనంలో శాశ్వతంగా నివాసమేర్పరచుకున్నాడన్న మాట. మూర్తీభవించిన కాంతికి పొరుగున అతను విడిది చేశాడన్నమాట.

దేవుడు సమస్త వివేచనలకు యుక్తులకు నిధిలాంటివాడు. అందుచేత దైవాన్ని పొందిన మనిషి చైతన్యవంతుడు అవుతాడు. దేవుడు యావత్తు భూమ్యాకాశాలకు కాంతి. కాబట్టి మనిషి దైవాన్ని పొందితే అతని వ్యక్తిత్వమంతా దైవికమయిన కాంతితో ప్రకాశించసాగుతుంది. దేవుడు సకల శక్తులకు సరోవరం. కాబట్టి దైవాన్ని పొందిన మనిషి ఎంతో శక్తిశాలి అవుతాడు. ఏ వరదా అతన్ని ముంచజాలదు. ఏ పెనుతుఫానూ అతన్ని కూల్చివేయలేదు.

# దైవదౌత్యం

ఇస్లాం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు కొంతమంది ముస్లిమేతరులు వచ్చి, మీరు నిజంగా దైవప్రవక్తేననడానికి ఆధారం ఏమిటి? అని అడిగారు. "లోగడ దైవప్రవక్త మూసా (అలైహి) మహిమలు చూపే చేతి కర్ర తెచ్చారు. అది ఆయన ప్రవక్త పదవికి సాక్షీభూతంగా పనికొచ్చేది. అలాగే ప్రవక్త ఈసా (ఏసుక్రీస్తు) గుడ్డివారికి చూపు ప్రసాదించేవారు. కుష్ఠురోగులకు స్వస్థత చేకూర్చేవారు. తనను ప్రవక్తగా చెప్పుకోవడానికి ఆయన చూపిన మహిమలవి. అలాగే ఇతర ప్రవక్తలు కూడా ఏదో ఒక అద్భుత చమత్కారాన్ని తమతోపాటు తెచ్చుకొని తమను దైవప్రవక్తగా నిరూపించుకున్నారు. మరి మిమ్మల్ని దైవప్రవక్తగా నమ్మడానికి మీ వద్ద ఉన్న నిదర్శనం ఏమిటి? అని వారు ప్రశ్నించారు. మాహాప్రవక్త ముహమ్మద్ (స) వారి సుదీర్ఘమయిన ప్రశ్నను సావధానంగా విన్నారు. ఆ తరువాత దివ్య ఖుర్ఆన్ యందలి ఆలి ఇమ్రాన్ సూరాలోని చివరి వచనాలను చదివి వినిపించారు – "భూమి మరియు ఆకాశాల సృష్టిలో, అవి రేయింబవళ్లు ఒకదాని తరువాత ఒకటి రావటంలో, నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్నివేళలా అల్లాహ్‌ను స్మరించేవారు, భూమి మరియు ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారు అయిన బుద్ధిజీవులకు ఎన్నో సూచనలు ఉన్నాయి. వారు అప్రయత్నంగా అంటారు : "ప్రభూ! ఇదంతా నువ్వు వ్యర్థంగా, లక్ష్యరహితంగా సృష్టించలేదు, నువ్వు పరిశుద్ధుడవు – నిష్ఫల కార్యాలను నువ్వు చెయ్యవు. కనుక ప్రభూ! మమ్మల్ని నరక యాతన నుండి కాపాడు. నువ్వు ఎవరినయితే నరకంలో పడవేస్తావో వాస్తవానికి అతణ్ణి అధోగతికి, అవమానానికీ గురిచేశావు. ఇక ఇటువంటి దుర్మార్గులకు సహాయం చేసేవాడెవడూ ఉండడు. ప్రభూ! మేము ఒక పిలిచేవాడి పిలుపును విన్నాము, అతడు విశ్వాసం వైపుకు పిలిచేవాడు, ఇంకా ప్రభువును నమ్మండి అని అనేవాడు. మేము అతని ఆహ్వానాన్ని స్వీకరించాం. కనుక మా స్వామీ! ఏ తప్పులనైతే చేశామో వాటిని మన్నించు. ఏ చెడులైతే మాలో ఉన్నాయో వాటిని దూరం చేయి. మా ముగింపు సజ్జనులైన వారితో చెయ్యి." (ఆలి ఇమ్రాన్ : 190 –193)

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఈ వచనాలు పఠించటం ద్వారా చేప్పదలిచిందేమిటంటే, మీ కళ్ళ ఎదుట నలువైపులా విస్తరిల్లి ఉన్న ఈ సృష్టి ప్రపంచమే నా దైవదౌత్యానికి నిదర్శనం. భూమ్యాకాశాల సమస్త వ్యవస్థ తన మూగభాషలో దైవదౌత్యాన్ని, దైవ సందేశాన్ని ధృవీకరిస్తున్నది. ఇంత జరిగినా మరింక మహిమల అవసరం ఏముంది?

ఇస్లాం ప్రవక్త (స) గారి ప్రవక్త పదవి శాశ్వత ప్రాతిపదిక గలదు. కనుక ఆయన క్షణికమయిన, తాత్కాలికమయిన మహిమలను చమత్కారాలను చూపాల్సిన అవసరం లేకుండింది. ఆయన పదవి వలెనే శాశ్వతంగా, ఆయన తదనంతరం కూడా మిగిలి ఉండే మహిమను చూపవలసిన అవసరం ఉండింది. అలా చేసినప్పుడే అన్ని కాలాల, అన్ని యుగాల మానవులు దాన్ని మహిమగా చూడగలరు. అందుకే దేవుని సృష్టి ప్రపంచాన్ని ఆయన తన పక్షాన నిత్యమైన మహిమగా చూపెట్టారు. పవిత్ర ఖుర్ఆన్‌లో విశ్వ వ్యవస్థకు చెందిన ఈ కోణాలు ఉదాహరించబడ్డాయి. మానవ సంస్కరణ కొరకు దైవ మార్గదర్శకత్వం అవసరమని అవి రుజువు చేస్తున్నాయి.

విశ్వ వ్యవస్థ తన పూర్తి అస్తిత్వంతో ఒక 'ప్రశ్న' అయితే దైవదౌత్యం (ప్రవక్త పదవి) ఆ ప్రశ్నకు 'జవాబు' లాంటిది. మన కళ్ళ ముందు ఒక మాహోన్నతమయిన, సంపూర్ణమైన ప్రపంచం ఉంది. కేవలం ఉండటమే కాదు, నియమబద్ధమైన ఒక వ్యవస్థతో పాటు అది నిరంతరం కదలాడుతూ ఉంది. అందులో ఎటువంటి అపసవ్యతగానీ, క్రమ రాహిత్యంగాని కానరాదు. అది ఊహకందని రీతిలో విస్తరిల్లి ఉంది. అయినా అందులో అసామాన్యమైన సామరస్యం, సమన్వయం కనిపిస్తాయి. అందులో ఎంతో అర్థవంతమైన, లక్ష్యబద్ధమైన కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అది అసంఖ్యాకమయిన తన అంగాలు, ఉపాంగాలతో నిర్ణీతమయిన నియమాలకు కట్టుబడి పయనం సాగిస్తోంది. అటువంటి అద్భుతమయిన ప్రపంచాన్ని చూసినప్పుడు, దాన్ని సృష్టించినవాడు, శాసిస్తున్నవాడు ఎవడు? ఏమీ లేని శూన్యం నుండి దీన్నంతటినీ ఉనికిలోకి తెచ్చినవాడెవడూ? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ప్రపంచం ఇంత ముఖ్యమైన ప్రశ్నను మన దృష్టికి తెస్తుంది గాని దానికి సమాధానం మాత్రం ఇవ్వదు. అది సృష్టికర్త అద్భుతాలను మన ముందు ఉంచుతుంది గాని సృష్టికర్త ముఖార విందాన్ని మాత్రం చూపెట్టదు. అనంతమయిన ఈ జగతిలో కదలిక ఉంది, జీవం ఉంది. వెలుతురు ఉంది. సృష్టి ప్రకియ ఉంది. వివిధ శక్తులున్నాయి. ఆఖరికి కొన్ని ప్రాణుల రూపంలో మాట్లాడే భాషలు కూడా ఉన్నాయి. కాని ఇవన్నీ ముఖ్యమైన ఆ ప్రశ్న విషయంలో మటుకు మౌనం వహించాయి. ఏ ఒక్కటీ మనిషిలో జనించిన ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వటం లేదు. తన ప్రశ్నకు సమాధానం వ్రాసి ఉన్న బోర్డు ఏదీ ఎక్కడా, ఏ పర్వతం పైనా కానరాదు. మనిషిలో ఉత్పన్నమయిన ఈ ప్రశ్నకు బదులిచ్చే వారెవరయినా ఉన్నారా? అని పరిస్థితుల స్వరూపం ఘోషిస్తున్నది.

దీంతోపాటు – ఈ జగతికి గమ్యం ఏది అన్న ప్రశ్న కూడా ముందుకు వస్తుంది. జగతిలోని వస్తువులన్నీ తమ పనిని చేసుకు పోతున్నాయి. భూమి నిరంతరం పయనిస్తోంది. సూర్యమండల వ్యవస్థ భూమిని, గ్రహాలను తీసుకుని ఒక వైపుకు సాగిపోతూ ఉంది. మరి సౌర కుటుంబాన్ని చూస్తే, అది సూర్యుణ్ణి, నక్షత్రాదులను వెంటేసుకుని అనవరతం పరుగులు తీస్తూనే ఉంది. అనంతమయిన విశ్వవ్యవస్థ తన భాగాలన్నింటితో సహా ఒకానొక గమ్యం వైపుకు సాగిపోతూనే ఉంది. కాని ఏ ఒక్కటీ తన గమ్యం గురించిన ప్రకటన చేయటం లేదు. తనెక్కడి నుంచి బయలుదేరిందీ, ఎక్కడికి చేరనున్నదీ ఏమీ తెలుపదు ఈ సృష్టి ప్రపంచం. ఇది అత్యంత ముఖ్యమయిన ప్రశ్న. ఎందుకంటే శీఘ్రంగా పయనించే ఈ లోకంలో మానవుడు కూడా భాగస్థుడే. అతను నిరంతరం తనకు తెలియని గమ్యం వైపుకు సాగిపోతున్నాడు. అతనే గనక తన ప్రయాణాన్ని – తన జీవన యాత్రను – తన గమ్యస్థానాన్ని గురించి తెలుసుకొనకపోయినట్లయితే అతని ప్రయాణమంతా అంధకారమయం అయిపోతుంది. పరిస్థితుల ఈ స్వరూపం చాటేదేమిటంటే, మానవునికి దీనికి సంబంధించిన యదార్థాన్ని తెలియజేసే ఏర్పాటు జరగాలి. ఇక మనిషి చేయవలసిందేమిటి? చేయకూడనిది ఏమిటి? అనేది మరొక ప్రశ్న. మనిషికి దైనందిన జీవితంలో ఎన్నో వ్యవహారాలు తారసపడ్డాయి. ఒకటికన్నా ఎక్కువ విధానాలను అవలంబించే అవకాశాలుంటాయి. అలాంటప్పుడు మనిషి దేన్నీ ప్రామాణికంగా ఎంచుకోవాలి? దేని ఎంపిక చేసుకోరాదు? మనిషికై జీవన సరళి ఏదై ఉండాలి? నీరు పల్లమెరిగి ప్రవహిస్తుంది. వృక్షాలు మొదలుకుని నక్షత్రాల వరకు ప్రతిదానికీ ఒక నియమావళి ఉంది. అవి తు.చ. తప్పకుండా వాటిని పాటిస్తూ ముందుకు సాగిపోతున్నాయి. దేన్ని అనుసరించాలి. దేన్ని విడనాడాలి అన్న ప్రశ్న వాటి ముందు లేదు. అయితే మనిషి పరిస్థితి తద్భిన్నం. అతనికి నిర్ణయాధికారం – ఎంపిక స్వేచ్ఛ – ఉండటం వల్ల ప్రతిసారీ తికమకపడుతుంటాడు. సూర్యుడు నియమబద్ధమైన ఓ వ్యవస్థకు కట్టుబడి ప్రతిరోజూ – నాగా లేకుండా – మనకు వెలుతురు వేడిమినీ అందిస్తున్నాడు. కాని అది మన జీవన సమస్యపై తన వెలుతురు ప్రసరించదు. గాలి తనదైన నియమావళి ప్రకారం నడుస్తుంది. ఇంకా పూల సువాసన మన మనో మస్తిష్కాలకు హాయినిస్తుంది. కాని అది మన అసలు సమస్య గురించి ఏ విధమయిన సమాచారం అందించదు. నీరు ఒక నిర్ధుష్టమయిన శాసనానికి కట్టుబడి ఉంది. అది మనకోసం చల్లదనాన్ని మోసుకువస్తుంది. కాని అది మన అన్వేషణలో ఏ విధంగానూ సాయపడదు. భూమి తన భ్రమణానుసారం అనుదినం మన కొరకు పగలు

తెస్తుంది. రేజీకటి తెరను తొలగిస్తుంది. కాని అది జీవన యాత్రికులకు సంబంధించిన ఈ రహస్య తెరను మాత్రం ఛేదించదు. వృక్షాలు భూమిని చీల్చుకుని పైకొస్తాయి. ఒక క్రమశిక్షణకు కట్టుబడి పనిచేస్తూ మనకు నీడనిస్తాయి. ఉపాధిని సమకూరుస్తాయి. కాని అవి మన ఆధ్యాత్మిక వికాసం కోసం, మనశ్శాంతి కోసం ఎలాంటి దినుసునూ ప్రసాదించవు. పక్షులు కిలకిలారావంతో ఆహ్లాదాన్ని అదిస్తాయి. వాటికి తమ జీవన వ్యవస్థ గురించి పూర్తిగా తెలుసు. కాని మనకర్థమయ్యే భాషలో అవి ఏ సందేశాన్నీ ఇవ్వవు. నక్షత్రాలు, గ్రహాలు ఒక్క సెకను కూడా తేడా లేకుండా అనుక్షణం పరుగులు తీస్తున్నాయి. కాని మనిషి ఏ గమ్యస్థానం వైపుకు సాగిపోవాలో మాత్రం అవి తెలుపవు. నిఖిల జగతిలోని ప్రతి వస్తువు తన నిర్ణీత మార్గంలో నడుస్తూ ఉంది. అల్పమయిన ఒక చీమ మొదలుకుని బ్రహ్మాండమయిన సౌరకుటుంబం వరకు ప్రతిదీ తమకివ్వబడిన నియమావళిననుసరించి మనుగడ సాగిస్తున్నాయి. ప్రతి దానికి తన క్రియాత్మక మార్గం గురించి క్షుణ్ణంగా తెలుసు. ఒక్క మానవుడే తన ఆచరణాసరళి గురించి తెలియని స్థితిలో ఉన్నాడు. సచేతనమయిన, అన్నీ తెలిసిన ఒక లోకంలో అతను స్తబ్ధుడై ఏమీ తెలియని వాడులా నిలబడి ఉన్నాడు. ప్రతి వస్తువు తన గమ్యం వైపునకు సాగిపోవటాన్ని అతను తిలకిస్తున్నాడు. కాని తనేం చేయాలి, ఎటుపోవాలి అనేది మాత్రం అతనికి బోధపడటం లేదు.

లోకంలో ఉన్న వస్తువులన్నింటికీ ఒక నిర్ణీత కార్యక్రమం ఇవ్వబడి ఉంది. వాటిని ఖచ్చితంగా పాటించటానికి అవి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. ఒక్క మనిషే వాటి నుండి మినహాయింపు పొందినవాడిలా ఉన్నాడు. నిర్ణీత కార్యక్రమానికి కట్టుబడకుండా ఉన్నవాడు మానవుడు ఒక్కడే. తాను కోరినది చేసే, లేక చేయకపోయే స్వేచ్ఛను అతను కలిగి ఉన్నాడు. భూమి తన కక్ష్యలోనే తిరుగుతుంది. ఇతర గ్రహాల పరిధుల్లోకి అది ప్రవేశించదు. ఈ విధంగా ప్రతి వస్తువు తన తన పరిమితుల్లో ఉంటుంది. కాని మనిషి పరిస్థితి అలా కాదు. అతను తన 'కక్ష్య'ను దాటి ఇతరుల 'కక్ష్య'లోకి అడుగు పెట్టే అవకాశాలుంటాయి. ఇతరత్రా వస్తువులు తమ కార్యాచరణ విధానాన్ని తమతోపాటే తెచ్చుకున్నాయి. కాని మనిషి మాత్రం తన జీవన సరళిని బయటి నుండి పొందవలసి ఉంది.

అధ్యయనం తెలిపే ఇంకొక విషయం ఏమిటంటే మనిషి తన జీవన సరళిని స్వయంగా కనుగొనలేడు. మనిషి బుద్ధివివేకాలను కలిగి ఉన్నాడు. అయితే అతని బుద్ధివివేకాలు

ఎంత పరిమితమైనవంటే వాటి ద్వారా అతను తన ముందున్న చిక్కుముడిని విప్పలేడు. వేనవేల సంవత్సరాల గత చరిత్ర ఈ విషయాన్ని తేటతెల్లం చేసివేసింది. లోకంలో తన అసలు ప్రశ్నకు సమాధానం తెలుసుకోకుండానే మనిషి ఖుద్దుగా పరిశోధన చేయసాగాడు. తరాల తరబడి కృషి చేసినా తాను ప్రగాఢంగా విశ్వసించదగ్గ విషయాన్ని సమీపించలేకపోయాడు. నక్షత్రాలు, గ్రహాల కదలికల నియమాలను అతను కనుగొనగలిగాడు. కాని తన జీవన యాత్రను గురించి, దాని ఆద్యంతాలను గురించి తెలుసుకోలేక పోయాడు. పదార్థం నశించి ఎనర్జీగా మారుతుందని, ఎనర్జీ అంతరించి పదార్థంగా రూపుదాలుస్తుందని అతను కనుగొన్నాడు. కాని మానవుడు మరణించిన తరువాత ఏమవుతాడన్న విషయమే ఏమీ తెలుసుకోలేక పోయాడు. విశ్వంలోని వస్తువులన్నీ ఒకే చట్టానికి కట్టుబడి ఉన్నాయని, ఏ కాస్త కూడా విముఖత చూపకుండా అవి వేనవేల కోట్ల సంవత్సరాలుగా తమ విధులను నిర్వర్తిస్తున్నాయని మాత్రం అతను గ్రహించాడు. అయితే మానవుని జీవన సంవిధానం ఏదై ఉండాలి అన్న దాన్ని గురించి అతనేమీ తెలుసుకోలేకపోయాడు. తన పరికరాల ద్వారా జగతి విస్తీర్ణాలను కనుగొన్నాడు. అత్యంత చిన్నవైన అణువుల్లో సూక్ష్మాతిసూక్ష్మాంశాల ఆరాలు తీశాడు. కాని మనిషి వాస్తవికత ఏమిటి, ఏ వ్యూహానికి కట్టుబడి అతను ఉనికిలోకి వచ్చాడు అనే విషయం గురించి అతనేమీ గ్రహించలేకపోయాడు. మనిషికి అత్యంత ముఖ్యమయిన ఈ విషయంలో అతనికి ఒక మార్గదర్శకుడు కావాలని బోధపడుతున్నది. దీనిద్వారా ప్రవక్త అవసరం ఎటువంటిదో తెలిసి వస్తోంది. మనిషి తన జీవితానికి గల పరమార్థాన్ని గ్రహించడానికి అవశ్యంగా దైవప్రవక్తపై ఆధారపడతాడు. ఆపైన మనం ప్రవక్త తెలియజేసిన విషయాలపై యోచన చేస్తే మానవ మార్గదర్శకత్వం కొరకు అతని అవసరం ఎంతగా ఉందో సుస్పష్టమవుతుంది. దేవుడు అతనికి సత్యబద్ధమైన జ్ఞానం వొసగి మానవుల మార్గదర్శకత్వం కొరకు పంపించాడు.

ఈ సృష్టికి ఒక కర్త ఉన్నాడనీ, ఆయనే తన అసాధారణమైన శక్తియుక్తుల చేత ఈ వ్యవస్థనంతటినీ నడిపిస్తున్నాడని, దైవప్రవక్త మనకు తెలియజేస్తాడు. ఈ సమాధానం కన్నా నిజమయిన సమాధానం మరొకటి ఉండజాలదు. ఈ సమాధానం ఎటువంటిదంటే ఒక మంత్రం ఉంది. అది చాలా పనిచేస్తోంది, జనులు దాని పనితనాన్ని చూసి అచ్చెరువొందుతున్నారు. కాని ఆ యంత్రం ఎక్కడ తయారయిందో దానిపై వ్రాయబడలేదు. ఆ సమయంలో తెలిసినవాడొకడొచ్చి ఈ యంత్రం విశ్వ విఖ్యాతిగాంచిన ఫలానా ఫ్యాక్టరీలో

తయారైందని ప్రకటిస్తే ఇది తెలియగానే ప్రజల సందేహం తీరిపోతుంది. ఎందుకంటే ఇప్పుడు యంత్రం పనితనానికి సంబంధించిన ధృవీకరణ వారికి లభించింది. అలాగే అద్భుతమయిన ఒక ప్రపంచం ఉండటం, మరి అది ఎంతో క్రమబద్ధంగా పనిచేయటం కూడా ఒక ప్రశ్నకు ఆస్కారమిస్తుంది. అసలీ విశ్వ మండలం ఎందుకు ఏర్పడిందీ? ఎలా నడుస్తున్నది? అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది. దీని వెనుక ఒక దేవుడున్నాడనీ, ఆయన తన దివ్యమయిన శక్తి సామర్థ్యాలతో దీన్నంతటినీ నడిపిస్తున్నాడనీ పలకగా మన ప్రశ్నకు జవాబు దొరికిపోతుంది. ఈ జవాబు మన బుద్ధికందనిది కాదు. ఎందుచేతనంటే, దైవాన్ని విశ్వసించడమనేది తన్ను తాను విశ్వసించడం వంటిది. మనం మన వ్యక్తిగతస్థాయిలో కనే, వినే, ఆలోచించే, అర్థం చేసుకునే, నడిచే సంఘటనలకు కారణభూతమయ్యే ఒక అస్తిత్వాన్ని గమనిస్తున్నాము. "మనిషి" రూపంలో ఏ శక్తియుక్తులనయితే పరిమితస్థాయిలో తిలకిస్తున్నామో, ఆ శక్తియుక్తులే మరింత స్పష్టంగా, మరింత విస్తృత స్థాయిలో దేవుని రూపంలో ఉంటే అందులో ఆశ్చర్యపడాల్సిన అవసరం ఏముంది. "నేను" ఉన్నాను అనే విషయం ఒక్కటి చాలు "దేవుడు" ఉన్నాడని రుజువు చేయడానికి.

ప్రవక్త తెలిపే రెండవ విషయం ఏమిటంటే; ఈ ప్రపంచం లక్ష్య రహితం కాదు. దీనికొక లక్ష్యం ఉంది, గమ్యస్థానం ఉంది. అది మరణానంతరం ముందుకు వస్తుంది. మనిషికి బాహ్యంలో కనిపించే ఈ స్వాతంత్ర్యం అతన్ని పరీక్షించే నిమిత్తమే ఉంది. ఈ స్వాతంత్ర్యమయినా ఒక నిర్ణీత గడువు వరకే ఉంటుంది. ఈ గడువు ముగిసేసరికి ప్రస్తుత వ్యవస్థ అంతా పటాపంచలైపోతుంది. తరువాత మరింత సంపూర్ణమయిన శాశ్వతమైన ఓ కొత్త వ్యవస్థ రూపొందించబడుతుంది. ప్రస్తుతం పరీక్షార్థం అగోచరంగా ఉన్న దేవుడు అక్కడ తన సంపూర్ణ శక్తులతో ప్రత్యక్షమవుతాడు. నేటి ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ రుచులు మరిగే అవకాశం ఉంది. కాని రాబోయే – మరో – ప్రపంచంలో ఆ అవకాశం అందరికీ ఉండదు. ఈ నాడు దైవానికి భయపడుతూ, ఆయనకు విధేయులై మసలుకున్నవారే ఆనాడు దైవానుగ్రహాలకు నోచుకుంటారు. మిగిలిన వారంతా దైవానుగ్రహాలకు అల్లంతదూరం విసిరేయబడతారు. దైవప్రవక్త యొక్క ఈ సువార్త కూడా సత్యబద్ధమైనదని తోస్తుంది. కనే, వినే, ఆలోచించే శక్తియుక్తులు గల మనిషిని దేవుడు సృష్టించగా, అటువంటి అద్వితీయుడైన దేవుణ్ణి మనిషి దర్శించకపోవటమా? పుట్టినవాడు చచ్చి మట్టయిపోవడమా? అంతకుమించి మరో పరమార్థం లేదా? ఎంత విచిత్రం!? మరి ఈ విశ్వ వ్యవస్థ కూడా ఎంత అర్థవంతంగా కానవస్తుందంటే,

అటువంటి దానికి ఒక గడువు అంటూ లేదంటే, అన్యాయాన్ని అన్యాయంగా, న్యాయాన్ని న్యాయంగా ప్రకటించి చూపే వ్యవస్థ ఏదీ లేదంటే అది మనిషి బుద్ధికందదు. దైవప్రవక్త ఇచ్చే సందేశం మానవ నైజం వాంఛించే, మానవ సమాజం కాంక్షించే సందేశం అది. శూన్యం నుండి అస్తిత్వాన్ని వెలికి వచ్చే ప్రపంచం, రేయి తరువాత అనివార్యంగా పగలు సంభవించే ప్రపంచం, ఒక చిన్న విత్తనం నుండి మహా వృక్షాలు మొలకెత్తే ప్రపంచం 'నేడు' 'రేపు'గా మారే ప్రపంచం – అటువంటి ప్రపంచం గురించి ఎవరయినా, దానికి ఒక గమ్యం ఉందని, అదే పరలోకం అని అంటే అది అతిశయోక్తితో కూడిన విషయం కాబోదు. పైగా అది మనిషికి మింగుడు పడే విషయం అవుతుంది. అనుదినం శుభోదయమవటం ఎంత సహజమో ఆ మహాదినం సంభవించటం కూడా అంతే సహజం రాబోయే "రేపు" ఎంత సత్యమో మరణానంతర జీవితం కూడా అంతే సత్యం. యదార్థమేమిటంటే మానవ నైజం వాంఛించే, మానవ స్వభావం కోరుకునే న్యాయాన్ని దైవప్రవక్త స్పష్టపరుస్తాడు. ఏ సత్యాన్ని గురించి ప్రపంచంలోని అనేక వస్తువులు సంకేత ప్రాయంగా చాటిచెబుతున్నాయో వాటిని దైవప్రవక్త మరింత విపులంగా వివరించి దాన్ని శాస్త్రబద్ధం చేస్తాడు.

ఇక ప్రవక్త మనకు తెలిపిన జీవన విధానాన్ని చూడండి. అదెంతో సులభగ్రాహ్యమైనది. ఆచరణ యోగ్యమైనది. అతను దేవుని తరఫున నియుక్తుడయిన సందేశహరుడు అని విశ్వసించడానికి అతని సందేశమే తార్కాణం. ఎందుకంటే దేవుని తరఫున ప్రభవింపజేయబడినవాడు మాత్రమే ఇంతటి స్పష్టమయిన, సత్యబద్ధమైన వాక్కును అందజేస్తాడు. మనిషికి ప్రవక్త అందజేసిన జీవన సరళి ఏమిటంటే అతను అల్లాహ్‌ను సేవించాలి. సేవించటం (ఇబాదత్) యొక్క భావం ఏమిటంటే మనిషి నిర్నిబంధంగా దైవానికి అర్పించుకోవాలి. ఆయనకే భయపడాలి. ఆయన్నే ప్రేమించాలి. అల్లాహ్‌నే తన సర్వస్వంగా పరిగణించాలి.

మనిషి స్వతః సిద్ధంగా ఎటువంటి వాడంటే అతను తన శ్రద్ధాభక్తులకు, కార్యకలాపాలకు ఒకానొక కేంద్రస్థానం ఉండాలని కోరుకుంటాడు. తన దృష్టిని, తన భావాలు భావనలను నిలుపుకోవటానికి అతనికొక బిందువు కావాలి. అది అతనికెటువంటి అవసరం అంటే దాన్ని వదలి అతను ఉండలేడు. అలాంటి ఒక లక్ష్యం అంటూ లేనివాడెవడూ లేడు. కొందరు తమ భార్యాబిడ్డలను లక్ష్యంగా పెట్టుకుంటారు. మరికొందరి లక్ష్యం వంశోద్ధారణ అయి ఉంటుంది. కొందరు ప్రాంతంపై దృష్టిని నిలిపితే, మరికొందరు జాతిపై దృష్టిని

కేంద్రీకరించి బ్రతుకుతారు. ఒకరు ధనాన్ని కూడబెట్టడం తన లక్ష్యంగా ఎంచుకుంటారు, ఇంకొకరు అధికారంపై దృష్టిని కేంద్రీకరిస్తారు. అయితే వీటిలో ఏ ఒక్కటీ మనిషి దృష్టిని కేంద్రీకరించడానికి తగినది కాదు. మనిషికి ఆశ్రయం కల్పించి ఆదుకునేది మాత్రమే నిజానికి అతని శ్రద్ధాభక్తుల కేంద్రబిందువు కాగలందులకు యోగ్యమైనది. జీవన యాత్రను గమ్యానికి చేర్చి సఫలీకృతం చేసేది మాత్రమే అతనికి కేంద్రబిందువు కాగలగాలి. అయితే పైన పేర్కొనబడిన వాటిలో ఒక్కదానికీ ఆ శక్తి లేదు. అవన్నీ ఖుద్దుగా ఒకరిపై ఆధారపడినవి. మరి అలాంటప్పుడు అవి మనిషికి ఎలా తోడ్పడతాయి? కేంద్ర స్థానం అనేది ఎంత గొప్పదై ఉండాలంటే ఒకే సమయంలో సమస్త మానవాళి దానిపై దృష్టి నిలిపినా, అందరూ అన్ని వైపుల నుంచీ దాని వైపుకు తరలివచ్చినా మానవ సమాజంలో ఎలాంటి అసంతులనం, అస్తవ్యస్తత నెలకొనకుండా ఉండాలి. కాని పైన పేర్కొనబడిన వస్తువుల వ్యవహారం అందుకు భిన్నంగా ఉంది. మానవుడు తన లక్ష్యంగా, తన కేంద్ర స్థానం చేసుకున్న ఇతరత్రా వస్తువులన్నీ పరిమితమైనవి. ఒక మనిషి వాటిని పొందాలంటే అవి ఇతరులకు దక్కకుండా చేసినప్పుడే పొందడం సాధ్యమవుతుంది. ఈ కారణంగానే సమాజంలో సతతం దోపిడీ, అశాంతి, అలజడులు కొనసాగుతుంటాయి. ఒక వ్యక్తి ఏదయినా ఒకదాన్ని పొందుతున్నప్పుడు అతను ఇతరుల నుండి దాన్ని లాక్కుంటున్నట్లు కనిపిస్తాడు. యదార్థానికి ఒక్క దేవుడు మాత్రమే వీటికి అతీతుడు. సకల మానవులు ఆయన్ని పొందడానికి ఎగబడినా వారిలో ఎలాంటి సంఘర్షణగాని, దోపిడీ భావనగాని ఏర్పడదు. ఎందుకంటే దేవుడు భౌతిక వస్తువులు, అవసరాలన్నింటికీ అతీతుడు. అక్కర లేనివాడు. ఆయన పరిమితులన్నింటికీ అతీతుడు మరియు పరిశుద్ధుడు.

మానవ సమాజంలో అత్యంత సంక్లిష్టమయిన సమస్య ఏమిటంటే అందులో ఎంత ఉన్నత చట్టం ఉన్నాసరే దాన్నుండి తప్పించుకునే మార్గాలను మనిషి వెతుకుతాడు. ఒకడికి అధికార బలం ఉంటే దాని ద్వారా అవకతవకలు చేస్తాడు. ఒకడు తన వద్ద ధనబలం ఉంటే దాంతో న్యాయాన్ని కొనుక్కుంటాడు. ఒకడు మాటకారి అయితే అందమయిన పదజాలాల చేత, వాక్చాతుర్యం చేత అన్యాయాన్ని న్యాయంగా నిరూపిస్తాడు. చెప్పవచ్చిందేమిటంటే ప్రతి ఒక్కడూ తన అసత్యాన్ని సత్యంగా చేసి చూపటానికి ఏదో ఒక ఉపాయం కనుగొంటాడు. కాని అదే అతన్ని దైవసమక్షంలో నిలబెట్టారనుకోండి, అతని ఎత్తుగడలు, ఉపాయాలన్నీ అతనికి అర్థవంతంగా, మిథ్యగా తోస్తాయి. వ్యవహారం మనిషీ – మనిషి మధ్య ఉన్నంత వరకే ఎన్ని ఉపాయాలయినా, ఎత్తుగడలయినా! కాని వ్యవహారం మనిషికీ – దైవానికి మధ్య

కేంద్రీకృతం అయ్యేసరికి ప్రతి మనిషీ నిజాయితీపరుడైపోతాడు. ప్రతి చేష్ట ముందు అతను జాగ్రత్త పడతాడు. ఎందుకంటే దైవం ముందు ఏ మాటా దాగదు. ఆయన సమక్షంలో ఎవరి శక్తీ నిలువజాలదు. యదార్థమేమంటే ఒక్క దైవ భావన ద్వారా మాత్రమే ప్రజల్లో చట్టం యెడల గౌరవభావం సృజించటం సాధ్యమవుతుంది. ఇది మినహా మరే ఇతర ప్రాతిపదిక ద్వారా కూడా ఈ లక్ష్యం సిద్ధించదు.

ప్రపంచంలో సువ్యవస్థను నెలకొల్పడానికి అన్నిటికన్నా ఎక్కువ అవసరమైనది త్యాగం. త్యాగం అనేక విధాలుగా చేయవలసి ఉంటుంది. ఒక్కోసారి ఎదుటివారి అభిప్రాయం ముందు మన అభిప్రాయాన్ని వాపసు తీసుకోవలసి వస్తుంది. మరోచోట మన ప్రతిష్ఠను ఇతరులకు అప్పజెప్పడానికి కూడా సిద్ధమవ్వాల్సి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు తన కుటుంబీకుల ప్రయోజనాలకంటే ఇతరుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వవలసి వస్తుంది. తన కష్టార్జితాన్ని పరులకు ధారబోయవలసిన పరిస్థితి కూడా ఏర్పడుతుంది. ఒక్కోసారి – ప్రాపంచికంగా తనకేమీ లభించకపోయిన తన శక్తియుక్తులను ధారబోయవలసిన అవసరం ఉంది. ఈ త్యాగభావన వ్యక్తుల్లో జనించనంతవరకూ నిజభావంలో ఎటువంటి సువ్యవస్థనూ నెలకొల్పటం సాధ్యం కాదు. ఈ త్యాగభావన గనుక లోపించినట్లయితే ప్రతి మనిషీ తన మాటను నెగ్గించుకోజూస్తాడు. పర్యవసానంగా సమాజం అశాంతి అలజడులకు ఆలవాలం అవుతుంది. ఈ ప్రపంచమే సర్వస్వం అయితే అసాధారణమయిన ఈ త్యాగాలు చేయవలసిన అవసరం ఏముంది? ఈ కారణంగానే – దైవాన్ని వదలి ఇతరత్రా వాటిని కేంద్ర బిందువుగా చేసుకున్న సమాజంలో నిరంతరం అల్లకల్లోలం జరుగుతూనే ఉంటుంది. ప్రజలు త్యాగాలు చేయడానికి సంసిద్ధమవరు. అంచేత అక్కడ శుభప్రదమయిన సుహృద్భావపూరితమయిన వాతావరణం ఏర్పడదు. అయితే ప్రవక్త జీవితపు మహదాశయం వైపుకు ప్రజల దృష్టి మరలిస్తాడు – తద్వారా ఈ సమస్య సులువుగా, అత్యుత్తమమయిన రీతిలో పరిష్కృతమవుతుంది. దాని తరువాత త్యాగమయులకు గొప్ప ప్రేరణ లభిస్తుంది. తాను చేసే ప్రతి త్యాగానికి దైవసన్నిధిలో గొప్ప విలువ ఉందని మరణానంతరం శాశ్వత స్థాయిలో అది తనకు వాపసు ఇవ్వబడుతుందని మనిషి గ్రహిస్తాడు. ఈ భావన సమాజంలో ప్రబలిననాడు సమాజంలోని అన్ని రకాల అన్యాయం అవ్యవస్థల వ్రేళ్లు తెగిపోతాయి. సత్యం, న్యాయం ప్రాతిపదికగా ఒక సువ్యవస్థ నెలకొంటుంది. అప్పుడు సమాజాన్ని సౌశీల్యవంతంగా తీర్చిదిద్దడానికి అవసరమయిన ఏ త్యాగాన్నయినా సరే చేయడానికి ప్రతి వ్యక్తీ సన్నద్ధుడవుతాడు.

ఇస్లాం ప్రవక్త (స) తెచ్చిన ధర్మం (దీన్) కొత్త ధర్మం ఏమీ కాదు. దేవుని ఇతర ప్రవక్తలు తెచ్చిన ధర్మాన్నే ఆయనా తీసుకువచ్చారు. అయితే ఇతర ప్రవక్తల ధర్మం వారి తదనంతరం సురక్షితంగా ఉండలేకపోయింది. వారి అనంతరం వారి అనుయాయులు ఆ ధర్మాన్ని సురక్షితంగా ఉంచగల సమర్థులని నిరూపించుకోలేకపోయారు. ఇస్లాం ప్రవక్త (స)ను దేవుడు తన అంతిమ ప్రవక్తగా పంపాడు. తన ప్రత్యేక తోడ్పాటుతో ఆయనకు (సఅసం) అన్ని జాతులపై, అన్ని మతాలపై ఆధిక్యతను ప్రసాదించాడు. ఆయనకు లభించిన ఆ అసాధారణమైన విజయం ఆయన దేవుని నిజమయిన ప్రవక్త అనడానికి ప్రబల తార్కాణం. ఆయనకు లభించిన సాఫల్యం ఎంతటి అపూర్వమయినదంటే ప్రపంచంలో ఎప్పుడూ ఎవరికీ అంతటి సాఫల్యం ప్రాప్తం కాలేదు. ఆయన దేవుని నియుక్తులని, దేవుని ప్రత్యేక సహాయం ఆయనకు అందింది అనడానికి ఈ సంఘటనే సజీవ సాక్ష్యం. ఒక సాధారణ మానవుడు ఎవరూ ఇంత మహత్తరమయిన విజయాన్ని సాధించలేడు. మరో విషయం ఏమిటంటే ఆయన (సఅసం) సాధించిన ఈ విజయం ద్వారానే ఆయన అందజేసిన ధర్మం సురక్షితంగా ఉండే ఏర్పాటు జరిగింది. ఆయన సాధించిన ఈ విజయం మూలంగానే ఆయన్ని విశ్వసించిన వారు ఒక సువిశాలమైన భూభాగంపై సుస్థిరమయిన ప్రభుత్వం స్థాపించగలిగారు. ఆ ప్రభుత్వం ఆయన బోధించిన ధర్మాన్ని శాశ్వతంగా రక్షించే ఏర్పాట్లు చేసింది. ఆయన ప్రభవించి 1400 సంవత్సరాలు పైబడ్డాయి. కాని ఇంతవరకు ఆయన అందజేసిన ధర్మంలో ఎలాంటి మార్పు జరగలేదు. ఆయన (స) ఏ రూపంలో ప్రపంచానికి అందజేశారో అదే స్థితిలో నేటికీ సురక్షితంగా ఉంది.

ఇస్లాం ప్రవక్త (సఅసం) తరువాత మరే ప్రవక్తా రారు. ప్రళయకాలం వరకూ ఆయన (స) సమస్త మానవులపై దైవప్రవక్తగా అలరారుతారు. దైవధర్మం తన సిసలయిన రూపంలో లేకుండా పోయినప్పుడే మరో ప్రవక్త రావలసిన అగత్యం ఏర్పడుతుంది. వెనుకటి జాతుల వారు దైవధర్మాలలో, దైవగ్రంథాలలో మార్పులు చేర్పులకు పాల్పడుతుండటం వల్ల మాటిమాటికీ దైవప్రవక్తలు ప్రభవించవలసిన అవసరం ఏర్పడేది. వారు ప్రజలు మరచిపోయిన పాఠాలను జ్ఞాపకం చేసి, దైదధర్మాన్ని సరికొత్త రూపంలో నెలకొల్పేవారు. అయితే ఇస్లాం ప్రవక్త (స) ఖుర్ఆన్ రూపంలో అందజేసిన గ్రంథం నేటికీ యథాస్థితిలో – సిసలు రూపంలో ఉంది. ముద్రణా యుగం మొదలయిన నాటి నుంచైతే అది మరింత భద్రం అయిపోయింది. ఆయన (స) ఒక విధంగా ఇప్పటికీ మన మధ్య సజీవంగా ఉన్నారని చెబితే అది సత్యదూరం

కాబోదు. ఎందుకంటే ఆయన ప్రబోధనలు, ఆయన జీవిత చరిత్ర, ప్రవక్తగా ఆయన సలిపిన నిరంతర కృషి – ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన రికార్డంతా సంపూర్ణంగా, సురక్షితంగా ఉంది – దాన్ని చదువుతుంటే దైవప్రవక్త (స) కళ్ల ముందు మెదులుతున్నట్లే ఉంటుంది. అటువంటప్పుడు మరొక నూతన ప్రవక్త రావలసిన అవసరం ఉండదు.

# పరలోకం

పరలోకంలో మనిషికి ఇవ్వబడే ప్రతిఫలం ఇహలోకంలో అతను చేసుకున్న కర్మలను బట్టి ఉంటుంది. అందుచేత కర్మ – ఫలం ఇవి రెండూ ఒకదానికొకటి పోలి ఉంటాయి. ఒక వ్యక్తి బంగారం ప్రోగుచేశాడు. కాని దేవుని వాటాను దైవమార్గంలో ఇవ్వటం లేదు. అందుచేత ఆ బంగారం అతని పాలిట నిప్పురవ్వగా మారుతుంది. మరణనంతరం ఆ బంగారం అగ్నిజ్వాల రూపం ధరించి ఆ మనిషిని చుట్టుముడుతుంది (తౌబా). మనిషి కర్మ – అతనికి లభించబోయే ప్రతిఫలం ఏ విధంగా పరస్పరం పోలి ఉంటాయో హదీసులో సవివరంగా తెలియజేయటం జరిగింది.

మేరాజ్ (ప్రవక్త గారి గగన యాత్ర)కు సంబంధించిన ఉల్లేఖనం ద్వారా తెలిసేదేమంటే మహాప్రవక్తకు ఆ సందర్భంగా ఎన్నో నిదర్శనాలు చూపబడ్డాయి. వాటిలో 'కర్మ – ఫలం'కు సంబంధించిన నిదర్శనాలు కూడా ఉన్నాయి. అక్కడక్కడ ఆయనకు సదాచరణల పరలోక ఫలం ఏ రూపంలో ఉంటుందో చూపబడింది. ఉదాహరణకు, ఒకచోట కొంతమంది ఒక పంట చేను కోస్తూ ఉంటారు. వారెంత పంట కోస్తే అంత పంట పెరిగిపోతూ ఉంటుంది. "ఎవరు వీరు?" అని దైవప్రవక్త (సఅసం) దైవదూతను అడిగితే, 'వీరు దైవమార్గాన పోరాటం సలిపేవారు' అని దైవదూత సమాధానమిస్తారు. అలాగే ఆయనకు దుష్కర్మల ప్రతిఫలం ఎలా ఉంటుందో కూడా విపులంగా చూపటం జరిగింది.

కొంతమంది తలలు రాళ్ళతో నుజ్జునుజ్జు చేయబడటాన్ని ఆయన చూసి 'వీరెవరు?' అని ప్రశ్నించారు. వీరెవరంటే వీరి తలబిరుసుతనం వీళ్ళను నమాజ్‌కు లేవకుండా చేసేది అని దైవదూత వివరించారు. మరికొంతమంది దుస్తులకు అతుకులు వేయబడి ఉన్నాయి. వారు పశువుల మాదిరిగా గడ్డి మేస్తూ కనిపిస్తారు. 'వీరెవరు?' అని దైవప్రవక్త అడిగితే, వీరు తమ సొమ్ములను దైవమార్గంలో ఖర్చుపెట్టేవారు కారు అని దైవదూత బదులిచ్చారు. ఆ తరువాత

దైవప్రవక్త ఒక వ్యక్తిని చూశారు. వాడు కట్టెల మోపును ఎత్తుకోవటానికి ప్రయత్నం చేస్తుంటాడు. ఎంతకీ ఆ మోపు అతనికి లేవకపోతే మరిన్ని కట్టెలు ఆ మోపులో వేసుకుంటాడు. 'ఎవరితను?' అని దైవప్రవక్త అడిగితే, ఇతనిపై బాధ్యతలు, అప్పగింతల బరువు ఎంతగా ఉండేదంటే దాన్ని అతను మోయలేకపోయాడు. అయినా అతను తన బాధ్యతలను తగ్గించుకునే బదులు మరిన్ని భాద్యతలను తనపై వేసుకునేవాడు అని దైవదూత వివరిస్తారు. కొందరి నాలుకలు, పెదాలు, కత్తెరతో కత్తిరించబడుతుంటాయి. 'ఎవరు వీరు?' అని దైవప్రవక్త ప్రశ్నిస్తారు. వీరు వక్తలు, అడ్డూ అదుపూ లేకుండా నోటిని దుర్వినియోగం చేసేవారు. అర్థంలేని మాటలు చెప్పి ఉపద్రవం సృష్టించేవారు అని దైవదూత సమాధానమిస్తారు. ఒకచోట ఒక రాతి బండకు చిన్న రంధ్రం పడింది. ఆ రంధ్రం నుంచి ఒక పెద్ద ఎద్దు బయటకు వచ్చింది. తరువాత అదే మళ్లీ ఆ రంధ్రంలోనికే దూరటానికి నానా తంటాలు పడసాగింది. కాని అందులోకి ప్రవేశించలేకపోయింది. 'ఏమిటి ఇదంతా?' అని దైవప్రవక్త అడిగారు. ఇది ఏవ్యక్తి ఉపమానం అంటే, అతను అతి నిర్లక్ష్య ధోరణితో కలహ కారణమైన ఒక మాటను అనేస్తాడు. తరువాత దాని తీవ్రపరిణామాలను గమనించి దాన్ని వాపసు తీసుకోవాలనుకుంటాడు, కాని వాపసు తీసుకోలేడు. ఒకచోట కొంతమంది ఉంటారు. వారు స్వయాన తమ శరీరాల మాంసం కోసుకుని తింటుంటారు. 'వీళ్లెవరు?' అని దైవప్రవక్త ప్రశ్నిస్తే, వీళ్లెవరంటే తమ సాటి సోదరులను ఎగతాళిచేసేవారు. వారిని ఎత్తిపొడుస్తూ ఉండేవారు అని సమాధానమిస్తారు దైవదూత. మరికొంతమంది దైవప్రపవక్తకు కనిపించారు. వారి గోళ్లు ఇనుపగోళ్ల వలె, రాగి గోళ్లవలె ఉన్నాయి. వారు తమ ముఖాలను, రొమ్ములను గిల్లుతూ, రక్కుతూ ఉంటారు. 'ఎవరు వీరు?' అని దైవప్రవక్త ప్రశ్నించగా, వీరు ప్రజలపై పరనిందకు పాల్పడేవారు, వారి మానమర్యాదలపై దాడులు జరిపేవారు అని దైవదూత సమాధానమిచ్చారు. ఇంకా కొంతమందిని దైవప్రవక్త చూశారు. వారి పెదాలు ఒంటెల పెదాలను పోలి ఉన్నాయి. వారు అగ్నిజ్వాలలను తింటూ ఉంటారు. వీళ్ల వ్యవహారం ఏమిటి? అని దైవప్రవక్త ప్రశ్నిస్తే, వీళ్లు ఇహలోకంలో అనాథల సొమ్మును తినేవారు అని సమాధానం వస్తుంది. మరికొందరి కడుపులు చాలా పెద్దగా ఉన్నాయి. అవి పాములతో నింపబడి ఉన్నాయి. వచ్చే పోయే వారు వాళ్లను కాళ్ల క్రింద త్రొక్కుతున్నారు. అయినా వాళ్లు ఉన్నచోట నుంచి కదల్లేకపోతుంటారు. 'వీళ్లెవరు?' అని దైవప్రవక్త అడిగితే 'వీళ్లు వడ్డీ సొమ్మును తినేవాళ్లు' అని దైవదూత బదులిస్తారు. మరికొంతమంది దైవప్రవక్తకు కనిపించారు. వారికి ఒక ప్రక్కన మంచి మాంసం ఉంచబడింది.

మరో ప్రక్కన కుళ్ళి కంపు కొడుతున్న మాంసం ఉంది. వాళ్ళు మంచి మాంసం వదిలేసి కుళ్ళిన మాంసాన్నే భక్షిస్తూ ఉంటారు. 'వీళ్ల సంగతేమిటి?' అని దైవప్రవక్త అడగగా, ఈ స్త్రీ, పురుషులెవరంటే ధర్మసమ్మతమయిన భార్యాభర్తలను వదలి అక్రమ సంబంధాల ద్వారా తమ లైంగిక వాంఛలను తీర్చుకునేవారు అని సమాధానం ఇవ్వబడింది.

స్వర్గ విషయం కూడా ఇటువంటిదే. అంటే మనిషి కర్మలను బట్టి అది అతనికి సిద్ధిస్తుంది. దివ్య ఖుర్ఆన్‌లో ఏమని సెలవీయబడిందంటే, తినడానికి ఏవైనా పండ్లు ఇవ్వబడినప్పుడల్లా వారు, 'ఇలాంటి పండ్లు పూర్వం భూలోకంలో మాకు ఇవ్వబడేవి' అని అంటారు (అల్ బఖర : 25). దీన్నిబట్టి తెలిసేదేమిటంటే పరలోకంలో లభించే కానుకలు ఐహిక కర్మలను పోలి ఉంటాయి, ప్రపంచంలో దైవదాసుడికి ఏ కర్మను చేసే సద్బుద్ధి లభిస్తుందో అటువంటి ప్రతిఫలమే స్వర్గంలో అతనికి ప్రాప్తమవుతుంది.

ప్రపంచంలో మనిషి ఏ పరిస్థితుల్లో ఏయే విధంగా స్పందిస్తున్నాడు. అనేది అతనియెడల పరీక్ష. ఒక రాయికి ఏదయినా పరిస్థితి ఎదురయిందనుకోండి, అది ఏ విధంగానూ స్పందిచదు. కాగా; మనిషి మాత్రం స్పృహ, చైతన్యం కల జీవి. మనిషికి ఏ సంఘటనైనా ఎదురయితే అతనిలో ఒకలాంటి కలకలం చెలరేగుతుంది. దానికి జవాబుగా అతను తన నోటినో, చెయ్యినో ఉపయోగిస్తాడు. అదే అతని పాలిట అసలు పరీక్ష. ఆసమయంలో మనిషి తన ఆలోచనను, తన ఆచరణను ఏ దిశలో ఉపయోగిస్తాడో దేవుడు పరీక్షిస్తాడు. దూషణలకు సమాధానంగా అతను దూషించాడా లేక అతని నోటి ద్వారా దీవెనలు వెలువడ్డాయా? అనే దాన్ని దేవుడు గమనిస్తాడు. మనిషికి ఏ పరిస్థితి ఎదురయినా సరే అతని ప్రతిస్పందన రెండు రకాలుగా ఉంటుంది. ఆ రెంటిలో ఒక స్పందన నరకాత్మకమైనది. మరొక స్పందన సకరాత్మకమైనది. ఒకటి : నరకానికి గొనిపోయేది, మరొకటి : స్వర్గంలో ప్రవేశం కల్పించేది. దైవాభీష్టానికి అనుగుణంగా లేని స్పందన నరకానికి గొనిపోతుంది. దైవాభీష్టానికనుగుణంగా, ఆయన ప్రసన్నతను చూరగొనేదిగా ఉండే స్పందన స్వర్గానికి చేరుస్తుంది. వేరేమాటల్లో ఒక స్పందన షైతాని స్పందన దాని గమ్యస్థానం నరకం. కాగా; మరొక స్పందన దైవ గమ్యస్థానం స్వర్గం. దైవికమయిన క్యారెక్టర్‌ను ప్రదర్శించిన వారు స్వర్గపు కోమలమయిన వాతావరణంలో వసింపచేయబడతారు.

ఇక షైతానీ క్యారెక్టర్ (పైశాచిక గుణాలు) ఉన్న మనిషి స్వభావం ఎలా ఉంటుందో

చూద్దాం. ఈ కోవకు చెందినవాడు ఏదయినా అవాంఛనీయమయిన పరిస్థితి ఏర్పడినప్పుడల్లా నిర్లక్ష్యంగా ప్రతిస్పందిస్తాడు. అతను ద్వేషంతోనే ఎదిరిస్తాడు. కోపానికి సమాధానం కోపంతోనే ఇస్తాడు. దీనికి భిన్నంగా దైవికమయిన క్యారెక్టర్ ఉన్న వాడెవడంటే, అతను దైవానికి భయపడుతూ ఉంటాడు. అతను భావావేశాలను నిగ్రహించుకుని, రాగద్వేషాలతో కూడిన మనోమయ భావాల నుంచి పైకి వచ్చి వ్యవహారం చేస్తాడు. అంతిమ దైవప్రవక్త (స) ప్రబోధించారు : నా ప్రభువు నాకేమని ఆజ్ఞాపించాడంటే నాకు దూరమైన వానితో నేను సన్నిహితం కావాలి. నాకు ఏదయినా దక్కకుండా చేసిన వాడికి నేను ఏదైనా ఇవ్వాలి. నాకు అన్యాయం చేసినవాడ్ని, నేను క్షమించాలి. ఇలాంటి అదేశాలు అనేకం ఉన్నాయి. వీటి ద్వారా బోధపడేదేమంటే విశ్వాసి (మోమిన్) అయినవాడు ఎదుటివారి వైఖరిని బట్టి గాక తన స్థాయికి శోభించే విధంగా ప్రవర్తించాలి. నకారాత్మక వైఖరి ప్రదర్శించబడినప్పుడల్లా అతను సకారాత్మకంగా ప్రతిస్పందిచాలి. ప్రజల మధ్య కలసిమెలసి జీవిస్తున్నప్పుడు అవాంఛనీయమయిన సంఘటనలనేకం ఎదురవుతుంటాయి. తాత్కాలికంగా మనిషిలో వ్యతిరేఖ భావాలు జనిస్తుంటాయి. అటువంటి సమయ సందర్భాలొచ్చినప్పుడల్లా మోమిని (విశ్వాసి) వ్యతిరేఖభావాలు లోలోనే దిగమ్రింగి, తనకు అన్యాయం జరుగుతున్నప్పటికీ ఎదుటవారి యెడల ఉత్తమ రీతిలో మెలగాలి.

స్వర్గం అత్యంత కోమలమైన, పవిత్రమయిన స్థలం. అల్లాహ్ ప్రత్యేక శ్రద్ధతో దాన్ని తన సజ్జనులైన దాసుల కొరకు నిర్మించాడు :

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : “స్వర్గవాసులు తింటారు, త్రాగుతారు. కాని వారు ఉమ్మివేయటం గాని, మలమూత్ర విసర్జనచేయటంగాని జరగదు” మరి తిన్నదంతా ఏమవతుంది? అని సహచరులు అడగ్గా ఆయన (స) ఇలా బదులిచ్చారు? “త్రేన్పులు వస్తాయి. చెమట పడుతుంది. అది కూడా మిష్క్ (కర్పూరపు వాసన)లా సువాసనను కలిగి ఉంటుంది. మీరు శ్వాస పీలుస్తున్నట్లే వారిలో హమ్ద్ మరియు తస్బీహ్ (దైవస్తోత్రం, కీర్తనలు)లు పొందుపరచబడి ఉంటాయి.

ఈ హదీసు ద్వారా విదితమయ్యేదేమిటంటే స్వర్గం ఒక పరిశుద్ధ స్థలం. చెమట సయితం అక్కడ సువాసన రూపంలో విసర్జించబడుతుంటుంది. తమలోని చెమటను చెమట రూపంలోనే వెళ్లగ్రక్కే జనులు అటువంటి అందాల లోకంలో ఎలా ప్రవేశిస్తారు? అసూయ,

ద్వేషం, కాపట్యం, ప్రతీకారం, అహంభావం – ఇలాంటివన్నీ మనిషిలోని కల్మషాన్ని పోలినవి. ఎవరయితే తమలోని మైలను, కసువును కసువు రూపంలోనే బహిర్గతం చేస్తారో వారు స్వర్గంలో వసింపజేయబడటానికి యోగ్యులు కారు. అశుద్ధతను సయితం పరిశుద్ధ రూపంలో వ్యక్తం చేసే సదాచార సంపన్నులు నివసించే దేవుని కాలనీ స్వర్గం. విద్వేషాన్ని వెదజల్లవలసిన సమయంలో సయితం ప్రేమామృతాన్ని చిలికించే దైవదాసులు స్వర్గంలో వసింపజేయబడతారు. శత్రువుపై ప్రతీకారం తీర్చుకునే అవకాశం చిక్కినప్పటికీ క్షమించి వదలిపెట్టే ఉదార స్వభావులు, ఈర్ష్యాద్వేషాలు కలిగే సమయంలో సయితం ఎదుటివారి శ్రేయాన్ని అభిలషించే సద్గుణ సంపన్నులు స్వర్గంలో నివసించడానికి అర్హులు. గర్వపడాల్సిన సమయంలోనూ అణకువను, వినయ వినమ్రతలను వ్యక్తపరిచే సజ్జనులు, అన్యాయం అక్రమాలకు పాల్పడే అవకాశం ఉ ండి కూడా న్యాయం చేసే సౌశీల్యవంతులు దేవుని స్వర్గంలో స్థానం సంపాదించడానికి అర్హులు. తమలోని అశుద్ధతను సయితం శుద్ధి రూపంలో వ్యక్తం చేయటం అంటే ఇదే.

ప్రపంచం ఏవిధంగా రపొందించబడిందంటే, ఇక్కడ అనేక సార్లు మనిషి అవాంఛనీయ సంఘటనలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ ప్రపంచం పరీక్షాలయం అవడంచేత ఇదంతా తప్పదు మరి. అవాంఛనీయమైన పరిస్థితుల్లో సయితం సకారాత్మకంగా ప్రతిస్పందిచే వ్యక్తి మాత్రమే స్వర్గానికి అర్హుడు. మరెవరయితే నకారాత్మకంగా భావాలకు నిలయమయ్యాడో అతను స్వర్గంలో ప్రవేశించే అర్హతను కోల్పోయాడు. ఇంకా స్వర్గంలో ప్రవేశించే వారెలా ఉంటారంటే, వారు ఆపద సమయాలలో నిస్పృహ చెందకుండా, ఖేదపడకుండా ఓర్పు వహిస్తారు. సంయమనంతో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటారు. ఎవరి వల్లనయినా తమకు బాధ కలిగినా వారిని శపించరు సరికదా దీవిస్తారు. ఎవరితోనయినా వ్యవహారం చేయవలసివస్తే న్యాయబద్ధంగా వారి హక్కులను నిర్వర్తిస్తారు. ఎవరయినా తమను విమర్శిస్తే ఆగ్రహో దగ్రులవకుండా ప్రశాంత మనస్సుతో వింటారు. సద్విమర్శను సహృదయంతో స్వీకరిస్తారు. ఒకరిపట్ల తమకు ఎన్ని ఫిర్యాదులున్నా సరే అతని పట్ల న్యాయదృష్టితోనే మెలగుతారు. ఎవరితోనయినా వారు ఏదయినా వ్యవహారం చేయవలసివస్తే ఎదుటివారు వీరిని సదాచార సంపన్నులని గుర్తించేలా మెలగుతారు. ఆఖరికి ఎదుటవారి కొరకు వైఖరి మూలంగా తమలో ద్వేషం, ప్రతీకార భావం పెల్లుబికినప్పటికీ దాన్ని వారు దిగ మ్రింగి తమ వ్యతిరేకతను శ్రేయోభిలాష రూపంలో ప్రదర్శిస్తారు. వారు ప్రాపంచిక జీవితంలో దేవుని పుష్పంలా మారిపోవాలి. ఆ పువ్వు నుండి దుర్గంధం సయితం సుగంధపరిమళం రూపంలో వెదజల్లబడాలి.

అనుక్షణం దైవనామస్మరణ చేస్తూ, దైవమే తమ సర్వస్వంగా జీవించే శుభాత్ములకు అటువంటి పవిత్ర జీవితం గడిపే సద్బుద్ధి లభిస్తుంది. వారు దైవాన్ని ఏ రీతిలో పొందాలంటే ఆ భావనలోనే వారు ఓలలాడాలి. అనుక్షణం వారి హృదయ స్పందనలో దేవుడు లీనమైపోయి ఉండాలి. దైవభీతి మరియు దైవప్రేమలో వారు మునిగిపోవాలి – అటువంటి ధన్యజీవులకే దేవుని తరపున పవిత్ర జీవితం గడిపే సద్బుద్ధి ప్రాప్తమవుతుంది.

మనిషిలో గర్వం, అహంకారం ఉప్పొంగిన వేళ అతను అణకువతో తలవంచాలి. ద్వేషం మరియు ప్రతీకార లావా పెల్లుబికినప్పుడు ప్రేమపపూర్వకమయిన వైఖరిని అవలంబించాలి. మనసులో దుర్బుద్ధికి ఆస్కారం కలిగిన క్షణాన తనను పరోపకారిగా నిరూపించుకోవాలి. తన నోట పరుల విషయంలో శాపనార్థాలు వెలువడుతుంటే నోటిని అదుపులో పెట్టి శుభాకాంక్షలను వ్యక్తం చేయాలి. ఎదుటివారి హక్కులను కాజేయాలన్న దుర్బుద్ధి కలగగానే దాన్ని అక్కడే అంతమొందించి వారి హక్కులను సంపూర్ణంగా – న్యాయబద్ధంగా – చెల్లించాలి. సత్యాన్నిగుర్తించి అంగీకరించినప్పుడు తమ పేరు ప్రతిష్ఠలు పడిపోతున్నట్టు అనిపించవచ్చు. అటువంటి సమయాల్లో కూడా తమ పేరు ప్రతిష్ఠల కొరకు ప్రాకులాడకుండా సత్య స్వీకారానికే ప్రాముఖ్యతనివ్వాలి. ఒకరిపై పగతీర్చుకోవాలని మనసు ప్రేరేపిస్తుంది. అటువంటి సందర్భాలెదురైనప్పుడల్లా ప్రతీకార భావాన్ని లోలోపలే అణచివేసి ప్రత్యర్థిపట్ల న్యాయసమ్మతమైన ధోరణిలో మెలగాలి.

మీరు ఒక ట్రక్కుపై పయనిస్తుంటే రోడ్డు మీద పరుగెత్తే ట్రక్కు మిమ్మల్ని కుదిపేస్తూ ఉంటుంది. అదే మీరు ఒక మంచి కారులో కూర్చున్నారనుకోండి, కారు ఎంత స్పీడుగా పోయినా అది మిమ్మల్ని కుదిపివేయదు. దానిక్కారణం ఏమిటంటే కారు చక్రాలకు మంచి స్ప్రింగులు అమర్చబడి ఉంటాయి. అందుచేత కారు తన కుదుపులన్నింటినీ తన చక్రాలకే పరిమితం చేసుకుంటుంది. ఆ కుదుపులు ప్రయాణీకులకు సోకనయినా సోకవు. దీనికి భిన్నంగా ట్రక్కు స్ప్రింగులు మామూలు స్ప్రింగులై ఉంటాయి. ఆ కారణంగా దాని కుదుపులు ప్రయాణీకుల దాకా చేరుతాయి. అల్లాహ్‌కు భయపడనివాడు ట్రక్కులాంటివాడు. అతడు తన మనోమయమైన కుదుపులను అణగార్చుకోలేడు – వాటిని ఇతరుల కొరకు వ్రెళ్లగక్కేస్తాడు. తద్భిన్నంగా అల్లాహ్‌కు భయపడేవాడు సుతిమెత్తని కారులాంటివాడు. కుదుపులన్నింటినీ అతను తన వరకే పరిమితం చేసుకుంటాడు. తనపై ఆధారపడి ఇతర మనుషులకు అవి సోకకుండా జాగ్రత్తవహిస్తాడు.

సహనం, సంయమనం అంటే ఇదే! ఓర్పు, నిగ్రహం అంటే ఇదే!!

ఇక ఓర్పు, నిగ్రహం గురించి మరింత విపులంగా చెప్పుకోవాలంటే ఇలా చెప్పవచ్చు. ఒక మనిషి నలుగురి మధ్యా నివసిస్తున్నప్పుడు అవాంఛనీయ అనుభవాలెదురైతే వాటిని లోలోపలే అణచుకోవాలి. దాని ప్రభావం పరిసరాలపై కనబడనీయరాదు. బాధాకరమయిన కుదుపులను తనపైకి తీసుకుని ఇరుగుపొరుగువారికి సంతోషాన్ని పంచిపెట్టాలి. ఈ దక్షత ఉన్నవాడే దేవుని స్వర్గంలో వసింపచేయడానికి అర్హుడు. స్వర్గం ఎలాంటి కోమలమైన, ఆహ్లాదకరమయిన స్థలమంటే అక్కడ చెమటలాంటి మలినం సయితం సువాసన రూపంలో గుభాళిస్తుంది. అటువంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఊపిరి పీల్చడానికి అర్హుడెవరు? తన అంతరంగంలోని మలినాన్ని సుగంధం రూపంలో బహిర్గతం చేయగల సహనశీలుడే దానికి అన్ని విధాలా తగినవాడు.

ఒక హదీసులో ఉంది : ఇది మనిషి యొక్క స్వీయాచరణ. అది పరలోకంలో అతనికి వాపసు ఇవ్వబడుతుంది. ప్రపంచంలోని మనిషి నైతిక కర్మలు పరలోకంలో భౌతిక రూపం సంతరించుకుంటాయి. ప్రపంచంలో సంభవించే ప్రతి సంఘటనలో మనిషికి రెండు రకాల సమాధానం లభించే అవకాశం ఉంటుంది. స్వర్గవాసి ఎవరో, నరకవాసి ఎవరో అవే నిర్ణయిస్తాయి. ఏదైనా ఒక సత్యం ముందుకు వస్తుంది – ఒకతను దాన్ని అంగీకరిస్తాడు, ఇంకొకతను త్రోసిపుచ్చుతాడు. ఏదయినా ఒక సమస్య ఉత్పన్నమవుతుంది. ఒకతను దానికి సంబంధించి న్యాయంగా వ్యవహరిస్తాడు. వేరొకడు అన్యాయానికి, అక్రమానికి ఒడిగడతాడు. ఏదయినా అనుకూలమైన పరిస్థితి ఎదురవుతుంది – ఇప్పుడు ఒక వ్యక్తి సహనంతో వ్యవహరిస్తాడు. ఇంకొకడు తలపొగరు చూపుతాడు. ఏదయినా పరస్పర వివాదాస్పదమయిన సమస్య తలెత్తుతుంది. అలాంటప్పుడు ఒక వ్యక్తి సంయమనంతో ప్రేమైక భావాన్ని వ్యక్తపరుస్తాడు, ఇంకొక వ్యక్తి నకారాత్మక దృష్టితో ప్రతీకార భావాన్ని వ్యక్తం చేస్తాడు. ఇవి రెండూ పరస్పర విరుద్ధమయిన స్పందనలు, ఇవే పరలోక జీవితంలో మనిషి గమ్యస్థానాన్ని రూపొందిస్తున్నాయి. మన నైతిక ఆచరణలు భౌతిక రూపం దాల్చిననాడు వాటిలో ఒకటి స్వర్గంగానూ, మరొకటి నరకంగానూ పరిణమిస్తుంది.

గమనిక : 1980ఫిబ్రవరి 1వ తేదీన నుంబాహెడ (రాజస్థాన్)లో చేసిన ప్రసంగానికి సారాంశం ఈ వ్యాసం.

# MAULANA WAHIDUDDIN KHAN
## English Books Free Download

**CPS INTERNATIONAL**

Presenting Islam Relevant to the Modern Age

WEBSITE: **WWW.CPSGLOBAL.ORG**
CONTACT US AT: **INFO@GLOBAL.ORG**

## DISCOVER GOD

By Contemplating on His Creation

NAME OF BOOK

1. DISCOVERING GOD
2. REALIZATION OF GOD
3. ATTRIBUTED OF GOD
4. MAN AND GOD
5.REMEMBRANCE OF GOD
6. IN SEARCH OF GOD
7. GOD-ORIENTED LIFE
8. THE CONCEPT OF GOD
9. THE WAY TO FIND GOD

## RELIGION AND SCIENCE

Rational Interpretation of Religion

NAME OF BOOK

1. GOD ARISES
2. RELIGION AND SCIENCE
3. ISLAM: THE VOICEOF HUMAN NATURE
4. ISLAM AS IT IS
5.THE VISION OF ISLAM
6. DISCOVER ISLAM

## SEARCH FOR TRUTH

Creation Plan of God

NAME OF BOOK

1. THE PURPOSE OF CREATION
2. REFLECTIONS OF LIFE AND DEATH
3. THE FINAL JOURNEY
4. LIFE, DEATH AND BEYOND
5. SEARCH FOR TRUTH
6. MAN KNOW THYSELF
7. THE REALITY OF LIFE
8. THE PURPOSE OF LIFE
9. THE CREATION PLAN OF GOD
10. GOD AND LIFE HEREAFTER

## ISLAMIC SPIRITUALITY

Developing a Paradisiacal Personality

NAME OF BOOK

1. TAZKIYAH:PURIFICATION OF THE SOUL
2. LEADING A SPIRITUAL LIFE
3. SPIRITUALITY IN ISLAM

## WISDOM OF LIFE

Living in Hope and Positivity

NAME OF BOOK

1. LIVING IN HOPE: OPPORTUNITIES AMIDST PROBLEMS
2. THE SECRET OF SUCCESS
3. THE MORAL VISION

## THE QURAN

God's Preserved Guidebook for Man

NAME OF BOOK

1. THE QURAN TRANSLATION ( IN 30 LNG)
2. QURAN COMMENTARY
3. DISCOVERING THE QURAN
4. THE QURAN: AN ABIDING WONDER
5. THE QURAN FOR ALL HUMANITY
6. QURANIC WISDOM
7. QURAN POCKET GUIDE
8. THE GOOD LIFE
9. A TREASURY OF THE QURAN

## APPLICATION OF PROPHETIC MODEL

Guidance for All Mankind

NAME OF BOOK

1. 100 PRINCIPLES FORPURPOSEFUL LIVING
2. MUHAMMAD: A PROPHET FOR ALL HUMANITY
3. THE PROPHET MUHAMMAD: A SIMPLE GUIDE TO HIS LIFE
4. AN ISLAMIC TREASURY OF VIRTUES
5. MUHAMMAD:THE IDEAL CHARACTER
6. WORDS OFTHE PROPHET MUHAMMAD
7. THE PROPHET MUHAMMADPOCKET GUIDE

## REDISCOVER ISLAM
## Differentiate between Islam and Muslims

NAME OF BOOK

1. ISLAM REDISCOVERED
2. WHAT IS ISLAM?
3. A SIMPLE INTRODUCTION TO ISLAM
4. INTRODUCING ISLAM
5. PRINCIPLES OF ISLAM
6. THE TEACHINGS OF ISLAM
7. ISLAM AND SULTAN
8. THE MAN ISLAM BUILDS
9. SPIRIT OF RAMADAN
10. RAMADAN:A MONTH OF PURIFICATION

## ISLAM AND THE MODERN AGE

Interpretation of Islam in Contemporary Style

NAME OF BOOK

1.THE ROLE OF ULAMA INTHE MODERN AGE
2. ISLAM: THE CREATOROF THE
3. THE SEEKER'S GUIDE
4. SIMPLE WISDOM
5. ISLAM AND THE MODERN MAN
6. ISLAM IN HISTORY
7. THE REVOLUTIONARY ROLE OF ISLAM
8. ISLAM STANDS THE TEST OF HISTORY
9. THE SHARIAH AND ITS APPLICATION

## TRUE FACE OF ISLAM

Religion of Peace

NAME OF BOOK

1. THE CONCEPT OF JIHAD IN ISLAM
2. THE POLITICALNTERPRETATION
3. THE TRUE JIHAD
4. ISLAM AND HUMAN WELFARE
5. TABLIGH MOVEMENT
6. ISLAM POCKET GUIDE
7. ISLAMIC FUNDAMENTALISM

## WOMEN IN ISLAM

Builders of Humanity

NAME OF BOOK

1. WOMAN BETWEEN ISLAM AND WESTERN SOCIETY
2. WOMAN BETWEEN ISLAM AND
3. THE SECRET OF ASUCCESSFUL FAMILY LIFE
4. POLYGAMY AND ISLAM
5. CONCERNING DIVORCE
6. HIJAB IN ISLAM

## PEACE IN ISLAM

Peace for the Sake of Peace

NAME OF BOOK

1. THE IDEOLOGY OF PEACE
2. ISLAM AND PEACE
3. ISLAM AND WORLD PEACE
4. THE DAWN OVER KASHMIR
5. PEACE IN KASHMIR
6. HOW TO ESTABLISH PEACE IN THE HOLY LAND
7. THE AGE OF PEACE
8. NON-VIOLENCE AND ISLAM
9. MANIFESTO OF PEACE

## INTERFAITH DIALOGUE

For Mutual Learning and Peace-Building

NAME OF BOOK

1. NON-VIOLENCE AND PEACE-BUILDING
I IN ISLAM
2. MANIFESTO OF PEACE
3. UNIFORM CIVIL CODE

## THE ALARM OF DOOMSDAY

The Beginning of the End of Human History

NAME OF BOOK

1. INTERPRETATION OF HUMAN HISTORY
2. PARADISE: THE FINAL PHASE OF THE
3. GLOBAL WARMING: THE DIVINE WARNING OF DOOMSDAY

## CALL TO GOD

Conveying the Divine Message to All

NAME OF BOOK

1. THE CALL OF THE QURAN
2. RE-PLANNING OF THE ISLAMIC
3. THE PROPHETIC ROLE OF NOAH
4. DAWAH MADE SIMPLE
5. DAWAH: THE MISSION OF
6. CALLING PEOPLE TO GOD
7. ISLAMIC ACTIVISM
8. THE GARDEN OF PARADISE
9. THE ROAD TO PARADISE

## ISLAM

God-Centred Religion

NAME OF BOOK

1. DOES GOD EXIST?
2. THE DISCOVERY OF GOD
3. MAN DOES NOT STAND ALONE
4. MAN AND GOD
5. DOES THE WORLD OF THE HEREAFTER
6. THE DESTINATION OF MAN
7. THE IDEOLOGY OF LIFE
8. THE CREATION PLAN OF GOD

## ISLAM

God-Centred Religion

NAME OF BOOK

1. GOD-ORIENTED LIFE
2. THE IDEOLOGY OF PEACE
3. THE ROOT CAUSE OF TERRORISM
4. PEACE IN ISLAM
5. PEACE IN THE QURAN
6. THE IDEOLOGY OF SPIRITUALITY
7. TAZKIYAH: PURIFICATION OF THE SOUL
8. KASHMIR: AN INTRODUCTION TO PARADISE

## ISLAM

God-Centred Religion

NAME OF BOOK

1. GLOBAL WARMING OR DIVINE
2. THE CRISIS OF MUSLIMS
3. ABOUT THE QURAN
4. ABOUT THE HADITH
5. THE SPIRIT OF SALAT
6. RAMADAN: THE MONTH OF FASTING
7. ZAKAT: THE PRESCRIBED CHARITY
8. HAJJ:THE PILGRIMAGE TO MAKKAH

## LIST OF ENGLISH LEAFLETS

1. About the Hadith
2. About the Quran
3. Does God Exist?
4. Does the World of the Hereafter Exist?
5. Global Warming or Divine Warning
6. God-Oriented Life
7. Hajj: The Pilgrimage to Makkah
8. Kashmir: An Introduction to Paradise
9. Man and God
10. Man Does Not Stand Alone
11. Peace in Islam
12. Peace in the Quran
13. Ramadan: The Month of Fasting
14. Tazkiyah: Purification of the Soul
15. The Creation Plan of God
16. The Crisis of Muslims
17. The Destination of Man
18. The Discovery of God
19. The Ideology of Life
20. The Ideology of Peace
21. The Ideology of Spirituality
22. The Root Cause of Terrorism and Its Solution
23. The Spirit of Salat
24. Zakat: The Prescribed Charity

# ఇస్లాం పరిచయం

ఇస్లాం అంటే ఏమిటి? ఈ జగతి వెనుక ఒకానొక శక్తిమంతుడున్నాడని, ఆయన సంకల్పమే దీని వెనుక పనిచేస్తోందనీ, ఆయనే దీనికి కర్త, పోషకుడనీ మనిషి తెలుసుకోవాలి. ఆయన సమక్షంలోనే ప్రతి ఒక్కరి లెక్క తేలవలసి ఉందనీ, ఆయన సమక్షంలో సత్యంగా ఖరారయ్యేదే సత్యమని , ఆయన ఎదుట అసత్యమని తేలేదే అసత్యమని మనిషి హృదయపూర్వకంగా విశ్వసించాలి.

ఇదే ఇస్లాం అంటే

GOODWORD
info@goodwordbooks.com
www.goodwordbooks.com